# స్మృతి స్రవంతి

## గొర్రెపాటి మహాలక్ష్మమ్మ

గారి షష్ట్యబ్ద పూర్తి మహోత్సవ సంచిక

ఘంటశాల 21-1-1979

# ఆహ్వానసంఘ కార్యవర్గము

శ్రీ కల్లీషా, ప్రెసిడెంటు

శ్రీ లింగాల సూర్యనారాయణ, కార్యదర్శి

## సభ్యులు

శ్రీమతి వేమూరి వెంకటరమణమ్మ
" గొర్రెపాటి సరస్వతమ్మ
" " వెంకటకుటుంబమ్మ
" దోనేపూడి సీతామహాలక్ష్మమ్మ
" వేమూరి ప్రపుల్ల
" గొర్రెపాటి రంగమ్మ
" జి. హనుమాయమ్మ
" గొర్రెపాటి లక్ష్మీకాంతమ్మ
" " ప్రసన్నమ్మ
" " బుల్లిమ్మ
" " సుబ్బమ్మ
" " చంద్రమ్మ
" వడ్లమూడి సుబ్బమ్మ
" గొర్రెపాటి సీతారావమ్మ
" " విశాలక్ష్మి
" వేమూరి సీతమ్మ
" " సరోజనమ్మ
" ఎవిగళ్ల వెంకటరత్నమ్మ

శ్రీమతి ఎవిగళ్ళ సీతారావమ్మ
" తుమ్మల రత్తమ్మ
" వడ్లమూడి ఈశ్వరమ్మ
" రామానుజం సుగుణామణి
" వేమూరి నవరత్నం
" కాట్రగడ్డ ధనలక్ష్మమ్మ
" కొండలపాటి గంగమ్మ
" దేవబత్తిన చిట్టిమ్మ
" వేమూరి సుగుణాంబ
" గొర్రెపాటి రమణమ్మ
" కదియాల బుల్లెమ్మ సత్యనారాయణపురం
" కొల్లి లక్ష్మీకాంతమ్మ కపిలేశ్వరపురం
" బంకా ఆంజనేయులు విజయవాడ కొత్తపేట
" అమిర్నేని త్రిపురాంబ విజయవాడ
" కె. సుబ్బమ్మ కపిలేశ్వరపురం
" మరీదు వెంకటరత్నం పెదవడ్లపూడి
" సలీమ్‌బాబా కొండపల్లి
" మీర్జామస్తాను చీరాల

# స్మృతి స్రవంతి

## గొర్రెపాటి మహాలక్ష్మమ్మ

గారి షష్ట్యబ్ద పూర్తి మహోత్సవ సంచిక

ఘంటశాల 21-1-1979

# ఆ శీ ర్వ చ న ప ం చ ర త్న ము లు

తే॥గీ॥ అలఘు గొర్రెపాటికుల మహద్ధిరత్న
మా। "మహాలక్ష్మినామం"మహామనీషి।
ఆయురారోగ్య భోగభాగ్యంబు లొసగి,
శ్రీమహాలక్ష్మి, సతము,రక్షించుగాక.

చ॥ ధర జన్మించిన, వర్ష మాస తిథులన్ దర్శించు భాగ్యంబ దె
వ్వరికిన్‌గల్గు నొవారు, ధన్యులనుచున్‌వ్రాక్రుచ్చు శాస్త్రమ్ము, సో
దరి; అభాగ్యమునందు కొన్న నిను, చేతః ప్రీతి దీవింతు। శ్రీ
హరి ఆరోగ్యమభీష్టసిద్ధివిడు నత్యంతానురాగమ్మునన్

3॥చ॥ అరువదియేడు లాయువని యందురుగా కలిలోన, నేటితో
నరువది పూర్తి జేసి, నిను నర్చన చేయుచునున్న సాధ్వినిన్
మరియొక షష్టిపూర్తి గను మానినిగా, నొనరించి ప్రోవుమా
తిరుపతి వేంకటేశ్వర; కలిదేవ శిఖామణి; నీకు మ్రొక్కెదన్

గీ॥ ఆయువగుగాక, నీకు విద్యాభిమాని।
జయమగునుగాక నీకు విశాలహృదయ।
జయమగునుగాక, నీకు పరిశుద్ధచరిత।
శుభమగునుగాక నీకువిశుద్ధజీవి

5 గీ॥ అస్తు సౌభాగ్యమస్తు దీర్ఘాయురస్తు:
వస్తు వాహన ధన ధాన్య ప్రాప్తిరస్తు;
గొర్రెపాటి కులాంబుధికువల యాక్షి:
స్వస్తి శ్రీరస్తు శుభమస్తు శాంతిరస్తు;

భవత్శ్రేయోలాషి
మధురకవి
శాకాని నరసింహారావు

---

శ్రీ వ్యాసాశ్రమము,
వ్యాసాశ్రమము పోస్టు,
వయా - యేర్పేడు చిత్తూరు జిల్లా (ఆం. ప్ర.)

విద్యానందస్వామి
ఓం లోకస్సమస్తాస్సుఖినోభవంతు.
ఓం శాన్తిశ్శాన్తిశ్శాన్తి : ఓం తత్సత్ ఓమ్

శ్రీమతి గొర్రెపాటి మహాలక్ష్మమ్మగారికి షష్టిపూర్తి మహోత్సవము జరుగుట ప్రమోదావహం. వారు కాంగ్రెస్‌లో చేరి దేశంకొరకు పాటుపడినవారు. విద్యా వ్యాసంగంతో గ్రంధరచన సైతము చేసినవారు. ఆధ్యాత్మికముగా బహుపరిశ్రమ సలిపినవారు. ధైర్య సాహసములుగలవారు సర్వోదయ సంఘమువారు. ఇట్టివారి షష్టిపూర్తి మహోత్సవమును జరిపించుట ప్రశంసనీయము. ఇచటనిది గమనించ దగినది.

మానవుడు అనేక దేవతల అనుగ్రహమువలన జీవించుచున్నాడు. తనకు అరువది యేండ్లు నిండినపుడు ఆ దేవతలను విధిపూర్వకంగా నారాధింపవలయును. ఆయారాధనతో వారి యనుగ్రహం బొంది, ఆత్మోద్ధరణమునకు అనుకూలమగు దీర్ఘాయుస్సును, పూర్ణారోగ్యమును సంపాదించుకొవలెను. వాని సంపాదనతో సంసారమునందనాసక్తి గలిగి బ్రహ్మాత్మైక్య విజ్ఞానము నార్జించి. సమస్త సంసారబంధ విముక్తులై, బ్రహ్మానందముతో విరాజిల్లవలయును. ఇదియే షష్ఠిపూర్తి శాంత్యుత్సవములోనున్న రహస్యమని పెద్దలందురు.

మహర్షిశ్రీ మలయాళ సద్గురుదేవుని అనుగ్రహముతో, మహర్షుల ఆశీర్వాదముతో, భగవంతుని కరుణా కటాక్ష వీక్షణముతో ఉక్తరీతిగా శ్రీ మహాలక్ష్మమ్మగారు ఆత్మ విజ్ఞానము నార్జించి, బ్రహ్మానందముతో విరాజిల్లుదురుగాక। ఓమ్.

# ఆశీస్సులు

శ్రీమతి గొర్రెపాటి మహాలక్ష్మమ్మ ఆదర్శ మహిళా సేవకురాలు. ప్రసిద్ధ ఘంటశాల పంచాయితీబోర్డు అధ్యక్షులుగా వుండి, గ్రామీణ ప్రజలను సంఘసేవలయందు నిర్మాణ కార్యక్రమములందు నడుపగల్గిరి

స్వర్గీయ కిసాన్ వెంకటసుబ్బయ్యగారికి కుడిభుజముగా వుండి రైతాంగసేవచేస్తూ వుండిరి. జమీందారీ రైతు వుద్యమములో ఆంధ్ర మహిళా సేవా కార్యములందు శ్రీమతి భారతీదేవి కెంతోగా తోడగు చుండిరి.

ఆంధ్రరాష్ట్ర మహిళా మహాసభను ఘంటశాలలో ఘనంగా జరిపించగల్గిరి.

మహిళా సంఘమునకునాయకులై భగవద్భక్తిని గ్రామీణ ప్రజలలో ప్రత్యేకంగా. మహిళలలో భక్తి, భజనసంఘ సంస్కార కార్యక్రమమును సాగిస్తున్నారు.

గాంధేయ ధర్మజీవిత సేవా కార్యక్రమములకు వారిదే ముందడుగు. ఆమె ఆదర్శ గృహిణి, తల్లి సోదరి, మహిళ. ఆమె భర్త, కుమారులు రైతు వుద్యమమందు కిసాన్ వెంకటసుబ్బయ్య సరస్వతమ్మకు, మా దంపతులకు ప్రియపాత్రులు. వారికి సర్వేశ్వరుడు సర్వశుభములు, ఆయురారోగ్యములు ప్రసాదించుగాక.

శ్రీ వెంకటేశ్వర సన్నిధిలో
తిరుమల

రంగ

---

# దీవన

నాఁడు నేఁడు తెనుఁగునాటఁ బెద్దఱికమ్ము
గన్న జనపదమ్ము ఘంటసాల
మెఱుఁగుపెట్టె దీనిమేలిమికిన్ మహా
లక్ష్మమాంబ గుణకలాపకలన

బహుముఖ సమాజసేవల
సహమహమికఁ జూపి లోక మదిరా యన నీ
మహిళామణి గాంధీయుగ
మహస్సు నార్జించి మేటిమనుగడఁ బడసెన్

డెందముతోడఁ నసంగా
నందయతిన్ గొలిచి తాత్త్వికాలోక చిరా
నందము గని యీ సంపద
నందఱ కిడి యీమె దాతృతాశ్రయ మయ్యెన్

సర్వోదయ కార్యక్రమ
నిర్వహణ సమర్థ శాంతినిధి లక్ష్మమ యాం
ధ్రోర్వీహితగా వింకొక
యర్వదియేం డ్లుండుఁగాక యని దీవింతున్

తుమ్మల సీతారామమూర్తి

## ఆ ధ్యా త్మి క జ్ఞా న ప్ర చా ర కు రా లు

## సౌభాగ్యవతి గొర్రెపాటి మహాలక్ష్మమ్మగారి షష్ట్యబ్దపూర్తి మహోత్సవ

## శు భా కాం క్ష లు

సౌ॥ శ్రీ మహాలక్ష్మమ్మగారికి బ్రహ్మానందదాయకమగు పరతత్వచింతన, ప్రకృతిలో పురుషుని (పరమాత్మను) పురుషునిలో ప్రకృతిని దర్శించుటకై చేయు అన్వేషణ, ఆధ్యాత్మిక జ్ఞానప్రచారములకొరకు అంత్యత అవశ్యకమగు ఆయువు ఆరోగ్యము శక్తి సంపదలను, ప్రత్యక్షదైవము, జగచ్చక్షువు అగు ఆదిత్యుడు అందచేయనున్నాడు. ఆమె అందు కొననున్నది. వీని దివ్య దర్శనము, దివ్యానుభూతి, దివ్యశృతి ప్రమోద హర్షదాయకములు.

శ్లో॥ ఆదిత్యాయ ఆది భూతాయ అఖిల ఆగమ వేదినే
అచ్యుతాయ అనంతాయ అవ్యక్తాయ నమోనమః.

ఆదినారాయణశర్మ.
కార్యదర్శి, ప్రకృతియోగ ఆరోగ్య కేంద్రము
విజయవాడ _ 1.

---

"బ్రవ్రూత సత్యం కతరోహ్యంగనానాం
దోషోస్తి యో నా చరితో మనుష్యైః ॥"

స్త్రీల విషయంలో మానవులు ఆచరించని దోషం ఏమైనా ఉన్నదా నిజం చెప్పండి."
-వరాహ మిహిరుడు

శ్రీమతి గొర్రెపాటి మహాలక్ష్మమ్మ స్త్రీ జన సంక్షేమము కొరకు అనేక సంవత్సరముల నుండి పాటు పడుచున్న మహిళ. ఆమె ఘంటశాల గ్రామములో ఆధ్యాత్మిక జ్ఞాన సమాజమును, మహిళామండలిని నెలకొల్పి పాటు పడుచున్నారు.

ఆమె స్త్రీ సమస్య అను వ్యాస సంపుటిని ప్రచురించింది. ఇంతేగాక ఆధ్యాత్మికజ్ఞానమును అందరు పొందేలాగున శంకరాచార్యులు, మండన మిశ్రుల సంవాదమును అనేక మార్పులు చేర్పులతో నవలారూపముగా అందించారు.

ఆమె షష్టిపూర్త్యోత్సవము, సర్వోదయసేవా సంఘమువారు సల్పుట ఆనందదాయకము.
ఆమె ఇతోధికంగా మహిళా సంఘానికి సేవచేయుగాక।


ఇట్లు
గొర్రెపాటి వెంకటసుబ్బయ్య



శ్రీ బాపనయ్య. మహాలక్ష్మమ్మ



పెద్ద మనుమడు



కుటుంబ సభ్యులతో మహాలక్ష్మమ్మ, హనుమాయమ్మ

-: జై శాంతి :-

## శ్రీ శ్రీ శ్రీ గొర్రెపాటి మహాలక్ష్మమ్మగారి వష్టి పూర్తి సందర్భమున,

## అధ్యక్షుని తొలి పలుకులు :-

ఆత్మ మతాధ్యాత్మిక జ్ఞానసమాజ అధ్యక్షులు శ్రీమతి గొర్రెపాటి మహాలక్ష్మమ్మగారి యొక్క ఆశయములు మానవ జీవిత పరిమాణము మూరేండ్లుకు పైగా అంత కాలము ప్రతిమనిషి పరహితము, ఆత్మహితము సాధించుటకు, సత్కార్యముల, నాచరించుటకై, ఏకాత్మ తత్వము నందలి షట్ తత్వ ప్రకరణములను అంగీకరించి తన అనుయాయులందరిని దైవోన్ముఖులుగా నిల్పిరి. యింతే గాక

వీరు జీవిత సుఖ శాంతు లన్నిటినీ సంఘ సేవకై నుపయోగించుచూ, ఆంధ్రావనిలో అనేక గ్రామములకు సమైక్యతత్వప్రబోధము చేయుటయే గాక తమ అనుయాయులకు భగవద్గీతాబుర్రకథ అభ్యసింపజేసి దీనిచే ప్రజలలో ఆత్మమతాధ్యాత్మిక వినూత్న చైతన్యము కల్పించిరి. యిది యిట్లుండగా భారతదేశమంతా పర్యటించి మూఢ నమ్మకాలను త్రోసిపుచ్చి సర్వులకు సనాతనమగు బ్రహ్మతత్వము నొకటేనని దృఢపర్చిరి.

వీరు గ్రామమున శ్రీ చైతన్యాన్ని రేకెత్తింపచేసి, వారినెల్లరిని సంఘటిత పరచి వేదాంతతత్వాభిముఖులుగా కావించిరి. మరియు గ్రామమునకు సర్పంచిగా కూడా వుండి, గ్రామీణ ప్రజల యందు మానవ సమైక్యతత్వాన్ని పెంపొందింప జేయుచూ, అప్యాయతా, అనురాగములను ప్రోత్సహించుచూ ఆధ్యాత్మిక జ్ఞాన సమాజము నొక దానిని స్థాపించి నిత్యకర్మయందు సత్యాన్వేషణము సంపూర్ణముగా బలపరచిరి.

మతముల యొక్క వైషమ్యాలను తొలగ గలందులకు కమ్లిషావారి అధ్యక్షతన ది 5-2-66 తేదీన, సర్వమత సమిష్టి మహాసభలు తమ గ్రామములో నెలకొల్పి పలుమతముల వారిని ఒకే వేదికపైన సమావేశ పరచి, గాంధీ ధ్యేయమును ప్రస్ఫుటమగునట్లు ప్రజలలో సన్నిహిత భావము పెంపొందించిరి. మతోన్మాద తత్వములను నిర్మూలించుటకై మహాలక్ష్మమ్మగారి సేవ అనంతమైనది.

కమ్లిషా
కమ్లిబాబా ఆషియానా పర్వత్
మొగల్రాజపురం, విజయవాడ-10

ఓం శ్రీ రామాయ నమః

శ్రీమతి గొర్రెపాటి మహాలక్ష్మమ్మగారు సాంఘికముగ ఆధ్యాత్మికముగాను ఘంటశాల గ్రామ మహిళా రత్నములకే గాక చుట్టుప్రక్కల గ్రామములలోని మహిళామణులకు గూడ గ్రంథ రచనలద్వారా సుబోధల ద్వారా ఉత్తేజమును కలిగించుచు సేవ దైవపూజ భగవన్నామ సంకీర్తన శ్రీ భగవద్గీతా పారాయణాది సత్కర్మలు జేయుచు చేయించుచు హిందూ ధర్మము కుంటుపడనీయక చేయుచు 1956లో ఆధ్యాత్మిక జ్ఞాన సమాజము నెలకొల్పి 1973లో శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభను మూడు రోజులు శ్రీ మలయాళ సద్గురు స్వాములవారి శిష్యరత్నముల ఆధ్వర్యమున జయప్రదముగ జరిపించిరి. మహిళా సమాజమునకు ఆదర్శకముగ పట్టుకొమ్మగా నిలిచి ఉత్సాహమును సడలనీయక రేకెత్తింపజేయుచు ప్రజ్ఞతో, దక్షతతో శ్రీ భక్త బృందమును నడిపించుచున్నారు. అట్టి విదుషీమణిని భక్త వత్సలుడు సర్వజ్ఞుడు నగు సర్వేశ్వరుడు ఆయురారోగ్యముల నిచ్చుచు కాపాడుచుండును గాక యని 21-1-79 తేదిని జరుగుచున్న శ్రీమతి మహాలక్ష్మమ్మగారి షష్టిపూర్తి మహోత్సవ సందర్భమున భగవానుని ప్రార్థించుచున్నాను.

చిన్మయ రామదాసు
శ్రీ మలయాళ సద్గురు పెద్దాశ్రమము
తాడేపల్లి, కృష్ణాజిల్లా

జీవితచరిత్ర ఎందులకు? ఏమి ప్రయోజనము? ఎవరికి?

శ్లో॥ యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః
సయత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే॥

గీతాధికారము అనగా ప్రశస్తమయిన కొనియాడదగిన మహిమచే పుష్టినొంది ప్రాముఖ్యము వహించిన ఉత్తమ స్త్రీలు పురుషులు ఏ ఆచారక్రియా విశేష ధర్మముల నాచరించిరో, యద్దానిని ప్రమాణము గా గ్రహించెదరో, అట్టి వారిని బుద్ధిమంతులైన జనులు ఆదరించెదరు.

మానవధర్మము—స్వయం తీర్ణః పరాన్ తారయేత్" అనగా తాను ఆచరించి ఇతరులను ఆచరింప జేయ వలయును. ఏ మానవుడు లోకమున ఆదర్శప్రాయముగా మంచి మార్గమున నడచి తరించుచు సాటి మానవ కోటికి సంతారక మార్గమును సూచించుచు ఉత్తమ కార్యముల నాచరించి చూపుచున్నారో ఇతరులు ఆ మార్గమునను సరించి అంతటివారగుటకును వారలు దేనిని ప్రమాణముగా గ్రహించి తరించి ఇతరులను తరింప చేయుచున్నారో వాటి యందు ప్రమాణ బుద్ధితో లోకము (జనులు) ఆసక్తితో ఆచరించి తరించుటకును లక్ష్యము చేయబడుచున్నది.

అట్టి మానవాళిలో ఉత్తమ స్త్రీలగు వీరల బాల్యాది కష్టపరంపరలకు గురియై కనివిని యెరుగని రీతిని విద్య లభ్యసించి గురుదైవంబుల భక్తినుంచి ఆత్మీయ బాంధవ్యముల యెంచి శుభముల పేకరించి ఉద్యోగాదుల నధిగమించి అగణ్యకీర్తి భూధనంబులు గడించి. దక్షిణోత్తర యాత్రల సేవించి పురాణ శ్రవణాదుల గావించి ఎంచక ధర్మముల వినియోగించి కవి గాయకిని విద్యార్థిని పోషించి కృషీవలుల మించి లోకమున మంచిని గ్రహించి క్రియలాచరించి చూపించిన కతన నుత్తమ మహోదారులయిరి. అట్టి వీరిజీవిత చరిత్ర మనకు లక్ష్యమగుచున్నది.

పరోపకారమన నెట్టిది - శ్లో॥ పరోపకారాయ ఫలంతి వృక్షః పరోపకారాయ వహంతి నద్యః పరోప కారాయ దుహన్తి గావః పరోపకారార్థ మిదం శరీరమ్॥ అనగా చెట్లు ఫలవంతములై పండి వంగి అనుభవించుట కిచ్చుచుండును నదులు ప్రజాక్షేమము కొరకు ప్రవహించుచుండును. తమ మలమూత్రాదులను మధుర క్షీర ఘృతా దులను శారీరక శ్రమను గోవులు పరుల కందించుచుండును. అటులనే వీరి క్రియలన్నియు పరోపకార యుక్తములై వలరారుచుండును.

వీరి ధర్మము కవులకు. గాయకులకు, పౌరాణికులకు, పండితులకు, అర్థిజనులకు, ఆతురులకు, బీదలకు, బోధకులకు, విద్యార్థులకు, అనాథలకు, అనాశ్రయులకు, కుంటి గ్రుడ్డి. కూలిజనంబులకు పైతము పద్వినియోగ పడుచున్నది.

శ్లో॥ మానమేవ మనుష్యాణాం ప్రథమం పరికల్పితం
సర్వదాహ్య స్థిరాః ప్రాణాః మానమాచం
ద్రతారకం, తస్మాత్సర్వ ప్రయత్నేన
మానం పంరక్షయేత్సుధీః ॥

అవి యుండుటవలన, బంధమోక్షముల సమకూర్చు మనస్సు ప్రధానముగాగల జీవులకు మానమే ప్రధానమైనది. ప్రాణములెన్నటికిని శాశ్వతములు కానేరవు. ఆచంద్రతారార్కమైనది మానము.పత్యము. నిత్యము కావున బుద్ధిమంతులగు ప్రతి వ్యక్తి ప్రాణరక్షణ కంటే మాన రక్షణకు విలువనీయదగియున్నది. అట్టి మహత్తర మానవాళిలో ఈ మహాలక్ష్మమ్మగారు ఉత్తములై యున్నందున వీరి జీవితచరిత్ర పురోగాములకు ఆధారముగాను, ఆదర్శప్రాయముగా నుండుటకై వ్రాయబడుచున్నది. ఈ మహానుభావురాలికి శ్రియః పతి, శతాధిక వత్సరాయురా రోగ్యైశ్వర్య యశస్సౌభాగ్యంబుల ప్రసాదించి సర్వదా సర్వదా సంరక్షించుచుగా తయది ప్రార్థించుచున్నాను.

ఇట్లు
లింగాల సూర్యనారాయణ
సర్వోదయ సేవాసంఘం
గాంధీ పర్వతం విజయవాడ 1

మా సన్నిధులను పొందుచు మమ్ములను ఆదరించు వారిలో శ్రీమతి గొర్రెపాటి మహాలక్ష్మమ్మగారొకరు. సర్వోదయ ప్రచారంలో మాకు వారితో సన్నిహితత్వం సంప్రాప్తించినది.

మన భారతదేశంలో అనాదినుంచి శాసనకర్తలు పురుషులగుటవలన మనకు అందించబడిన శాసనములు కొన్ని స్త్రీ జాతికి అన్యాయం కలిగించినవై యున్నవి. ఉదార హృదయంతో పరికించినచో ఈ సత్యం విదితం కాగలదు.

ఋషి, ద్రష్ట అయిన ఆచార్య వినోబాభావే ఈ లోటును సవరించుటకు పది. పన్నెండేళ్ల క్రితం పవనార్(వార్ధాకు 5, 6 మైళ్లదూరం)లో బ్రహ్మ విద్యామందిరమును ప్రారంభించిరి. అచట ఎనలేని కృషి జరుగుచున్నది. 25, 30 మహిళలు అచట ఆధ్యాత్మిక శిక్షణ పొందుచున్నారు

మనువు ఆదిశంకరునివలె స్త్రీ జాతిలో ఆవిర్భవించి స్త్రీలకు న్యాయంచేసే శాసనకర్తలు వెలువడవలెనని వారి ఆకాంక్ష. ఇప్పటికే అచటి ప్రగతి పరికించినచో వినోబాగారి కోరిక నెరవేరగలదని దగ్గరనుంచి చూచిన వారికి విదితం కాగలదు.

మన మహాలక్ష్మమ్మగారు ఈ కోవకు చెందిన స్వతంత్ర మహిళయని, ఆమెను ఎరిగినవారు గ్రహించగలరు. ఆమె సంఘసేవ ఉజ్వలమైనది, పవిత్రమైనది. ఇట్టి మహిళలు మన అభ్యుదయానికి ఎంతైన అవసరము.

ఈమెకు సర్వేశ్వరుడు దీర్ఘ ఆయుర్దాయమును ఆరోగ్యమును ప్రసాదించి సంఘసేవకు ఇంకను హెచ్చుగా ఉపయోగపడునట్లు అనుగ్రహించుగాక.

శ్రేయోభిలాషి

హైద్రాబాదు — వెంపటిసూర్యనారాయణ

---

ఆంధ్ర రాష్ట్రమున కృష్ణాజిల్లాలో దివి తాలూకా యందు ఘంటసాల గ్రామము ప్రసిద్ధిగాంచినది. ఒకప్పుడు బౌద్ధమత ప్రచార కేంద్రమిచ్చట కలదు. ఇట్టి సుప్రసిద్ధమైన ఘంటశాల గ్రామము శ్రీ గొర్రెపాటి మహాలక్ష్మమ్మ గారి నివాసము.

స్త్రీలోకమునందు మహాలక్ష్మమ్మగారు విలక్షణ బుద్ధికలవారు. ఆమె పంచాయితీ ప్రసిడెంటుగా నుండెను. ఆధ్యాత్మిక జ్ఞానసంపన్నురాలు. అనేక సభలయందు ఆధ్యాత్మికధార్మికోపన్యాసముల నామె చెప్పియున్నది. ఆధ్యాత్మిక విషయ ప్రవచనములకు సంబంధించిన అనేక సభలనామె ఏర్పాటుచేసి జయప్రదముగా జరిపియున్నది. మృదు మధురమగు రచన చేసెడి శక్తి ఆమెకున్నది. కొన్ని గ్రంథములు ఆమె ప్రకటించి యున్నది. ఆమె భర్త కోడలు కుమారుడు ఆమె కీర్తి పతాకమునకు స్తంభములనదగినవారు, ఆమె మహిళా సంఘము నేర్పరచి ఆ సంఘ సహాయముతో నొక ఆశ్రమమును నిర్మించి యున్నది. ఆ ఆశ్రమమున ఆధ్యాత్మిక ప్రవచనముల జరుపుచున్నారు. సజ్జనులను సన్యాసుల నాదరించెడి సద్భావమామెకున్నది. మఱియు సర్వోదయ కార్యక్రమములకును ఆమె దోహదము కలదు. ఇట్టి పుణ్యాత్మురాలగు మహాలక్ష్మమ్మగారు షష్టి పూర్తి మహోత్సవము జరుపుకొనుటత్యం సంతోషకర విషయము. స్త్రీలోకమున కాదర్శవంతురాలగు శ్రీమహాలక్ష్మమ్మగారిట్లే సర్వేశ్వరానుగ్రహము చేతను మహర్షుల కరుణ వలనను చిరకాలమాయురారోగ్యములు కలవారై కళ్యాణ ప్రదవర్తనతో సఫలజీవితమును గడుపుదురుగాక.

నిర్విషయానందస్వామి.
శ్రీ మహాయోగినీ ఆశ్రమము,
పెనుమెత్స(PO)
(వయా) వీరంకిలాకు. గన్నవరం తాలూకా.

# శ్రీ శాంతి ఆశ్రమం

తోటపల్లి హిల్స్, (వయా) శంఖవరం ఇ. జి డిటి.

ఆత్మ స్వరూపులు

ఆశ్రమ శ్రేయోభిలాషిణి అయిన శ్రీమతి గొర్రెపాటి మహాలక్ష్మమ్మగారి షష్టిపూర్తి మహోత్సవం గురించి 21-1-79 తేదిని ఘంటశాలలో సర్వోదయా సేవాసంఘం వారు జరుపుచున్నందుకు పూజ్యశ్రీ ఓంకార్ స్వాముల వారెంతయో ఆనందించుచున్నారు.

శ్రీమతి మహాలక్ష్మమ్మగారు ఆశ్రమ శ్రేయోభిలాషులుగా ముఖ్యంగా గురుకుల అనాధ బాలబాలికలకు చేయుచున్న వారి ఎనలేని సేవకు పూజ్యశ్రీ వారెంతయో ఆనందించుచున్నారు.

దైవపరితాపన దైవజ్ఞప్తియే జీవిత పరమావధిగా " పరోపకారార్థ మిదం శరీరం " అన్న ఆర్యోక్తి అక్షరాలా శ్రీమతి మహాలక్ష్మమ్మగారు జీవితములో ముఖ్యఆశయముగా పెట్టుకొని వారు చేయుసంఘసేవ గణనీయము

దుర్లభమయిన మానవ జన్మ దొరుకుటయే కడు దుర్లభం. అట్టి పవిత్ర జన్మను సార్థకం చేసుకొనుటకు నిస్వార్థసేవలు దైవప్రార్థనలు ముఖ్యమయిన అంగములుగా యున్నవి.

శ్రీమతి మహాలక్ష్మిగారి విశిష్టత ఏమన వారు ఆధ్యాత్మిక దైవజీవనమును గడుపుచూ, సంఘసేవికగా ఎనలేని నిస్వార్థసంఘసేవచేయుచూ, వారి ఆధ్యాత్మిక దివ్యజీవనమునకు వన్నెతెచ్చుకొనుటలో అతిశయోక్తి లేదు. వారు సంఘమునకు చేసిన దైవసేవలే తార్కాణములు. శ్రీ శాంతి ఆశ్రమము పూజ్య శ్రీ స్వామీజీ 1911 సం॥ రంలో, స్థాపించి గురుకులమును ప్రవేశపెట్టి అనాధ బాల బాలికలకు విద్యావసతి సౌకర్యములతో ఈ 62 సంవత్సరాల నుండి చేయు జ్ఞానయజ్ఞంలో అవిరళ కృషికి శ్రీ మతి గొర్రెపాటి మహాలక్ష్మమ్మగారు అందించిన అపార సహాయ సహకారములకు మేమెంతయో కృతజ్ఞులము. ఆ తల్లి షష్ఠి పూర్తి మహోత్సవ సందర్భముగా వెలువడు " స్మృతి స్రవంతి " ఆమె ఎనలేని సాంఘిక దివ్య జీవితమునకు ఒక మణిపూసగా శ్రీ సర్వోదయసంఘము రూపొందించుట గణనీయము.

పూజ్యశ్రీ శ్రీమతి మహాలక్ష్మమ్మగారి షష్టిపూర్తి మహోత్సవములలో మీ సర్వోదయ సేవా సంఘ సభ్యులందరూ వేదసారమయిన శ్రీశాంతి ప్రార్థనలు 108 సార్లు మీ సభ్యులు, ప్రత్యేకఆహ్వానితులు శ్రీమతి మహాలక్ష్మమ్మగారి అనుయాయులు అంతా ఏక కంఠముగ ప్రార్థనలు జరిపి ఆమె శతాధికవత్సరములు మనుగాకయని పూజ్యశ్రీ వారు కోరుచున్నారు. ఇదియే పూజ్యశ్రీవారి సందేశము. దైవము శ్రీమతి గొర్రెపాటి మహాలక్ష్మమ్మగారికి ఆయురారోగ్య ఐశ్వర్యములనిచ్చి సదా బ్రోచు గాక। 21-1-1979 వ తేదీ పూజ్యశ్రీ స్వామీజీవారి 85 వ జన్మదినము గాన అమ్మగారి జన్మదినముగా శ్రీ శాంతి ఆశ్రమంలో కూడ శాంతి ప్రార్థనలు లక్షపత్రి పూజలు. శ్రీ గొర్రెపాటి మహాలక్ష్మమ్మ గారికి ఆశ్రమవాసులూ, గురుకుల బాలబాలికలు ప్రత్యేక శాంతిప్రార్థనలు వారి షష్టిపూర్తి మహోత్సవ సందర్భముగా జరిపించుచున్నాము.

ఇట్లు

స్నేహాస్పద

కుమారి జ్ఞానేశ్వరి

కార్యదర్శిని



భగవద్గీత బుర్రకథ దళం



మొవ్వ సమితి దుస్తుల తయారీ శిక్షణ కేంద్రము, ఘంటసాల 1969_70

# స్మృతి స్రవంతి

వంశము, జననము:

అనంతాత్మ నుండి ప్రపంచమనే తెరమీద ప్రాలానుగద. మాది ఒక చిన్న పల్లెటూరు. దానిని ఘంటశాల పాలెం అంటారు. మా వాళ్ళది సంపన్న కుటుంబం. మా ముత్తాత వేమూరి వెంకట్రామయ్యగారు అరవైనాలుగు ఊళ్ళకి పెత్తందారు. అప్పుడు గ్రామాలలో కలిగిన తగాయిదాలను కోర్టులకి పోనిచ్చేవారు కారట. పెద్దమనుష్యుల వల్ల పరిష్కారమై పోయేవట. ఆ విధముగ వెంకట్రామయ్యగారు పరగణా పెత్తందారుగా యుండేవారు.

పూర్వము జమిందారులు యుండేవారు అరవై ఆరు ఊళ్ళు ముప్పైమూడు పల్లెలు కలిసి ఒక పరగణా అనేవారట. ఆ పరగణాకు పెత్తందారు ఇతడు. అతనికి ఆరుగురు కుమార్తెలు. ఇద్దరు కుమారులు. వారికి తొలి సంతానము వెంకటకృష్ణయ్య రెండవవాడు సుబ్బయ్యగారు.

వెంకట్రామయ్యగారి పెద్ద కుమార్తె లక్ష్మీదేవమ్మ. రెండవ కుమార్తె బాపనమ్మ మూడవ కుమార్తె రత్తమ్మ నాలుగవ కుమార్తె శ్రీరామమ్మ. ఐదవ కుమార్తె సీతమ్మ. ఆరవ కుమార్తె మహాలక్ష్మమ్మ ఈమెకు సంతానం లేదు.

సీతమ్మగారికి మా అమ్మగారు ఒక్కతే కుమార్తె లక్ష్మీకాంతమ్మ. ఆమె పుట్టిన తరువాత మా తాతగారు ( మాతామహుడు ) దోనేపూడి దేవయ్యగారు సంవత్సరం ఆరుమాసాలకు స్వర్గస్తులయ్యారు.

లక్ష్మీకాంతమ్మను పెద్ద మేనమామ వెంకటకృష్ణయ్యగారి కుమారుడు వెంకయ్యగారికిచ్చి పెండ్లి చేశారు.

అంత మాఅమ్మమ్మ సీతమ్మగారు అన్న కుమారునికి తన కుమార్తెనిచ్చి పుట్టింటి దగ్గరనే ఉండిపోయింది. లక్ష్మీకాంతమ్మ వెంకయ్యగార్లకు వెంకటరత్నమ్మ మహాలక్ష్మమ్మ అను ఇద్దరు కుమార్తెలము. మా తమ్ముడు వెంకటకృష్ణారావు ఎమ్ ఏ. చదివాడు ఉద్యోగము చేయుట లేదు. పందొమ్మిదివందల పందొమ్మిది సంవత్సరం జనవరి ఇరవై ఒకటవ తేదీన జన్మించితిని.

మా అక్క వెంకటరత్నమ్మగారికి ఇద్దరు కుమార్తెలు ఉమామహేశ్వరి పారిజాత పుష్పావతిగారలు. పారిజాత పుష్పావతికి పిల్లలు లేరు. ఉమామహేశ్వరికి ముగ్గురు కుమారు

లున్నారు. భాస్కరప్రసాద్, రాధాకృష్ణ, రాఘవేంద్రరావుగారలు. భాస్కర ప్రసాద్‌కు ఇద్దరు కుమారులు. నాకు ఒక్కడే కుమారుడు చంద్రశేఖరరావు. బి. ఏ. చదివాడు ఉద్యోగంలో ప్రవేశించలేదు. వ్యవసాయము అన్ని వృత్తులలో శ్రేష్టమైనదని పెద్దలంటారు. అట్టి రైతును ఎవ్వరూ గుర్తించలేక పోయిననూ అన్ని ప్రాణులకు ఆవశ్యకమైన ఆహారమును సృష్టించేవాడు రైతే గద. అతడే ఆ పంటలను శ్రద్ధాభక్తులతో పండించకపోతే ఈ ప్రాణి కోటికి ఆధారమేది? కనుక శ్రేష్టతరమైనది వ్యవసాయమని అంటారు. ఉద్యోగాలకు అందరు సన్నద్ధమైతే ఎందరికని లభ్యమవుతాయి. గనక ఆస్తి లేనివాళ్ళకు లభ్యమైతే చాలును. ఆస్తి గలవారు చదువుకుంటే, తెలివి బుద్ధి ప్రకాశించితే తోటి మానవులకు సహాయము, సేవ చేయ వచ్చును. అప్పుడు సౌఖ్యము మానవ సమాజమునకు లభించుతుంది.

కనుక మా తమ్ముడు వెంకటకృష్ణారావు నా కుమారుడు చంద్రశేఖరరావులు వ్యవసాయమే వృత్తిగా భావించి రైతులగనే యుండియున్నారు. నిత్య వ్యవహారములలో ఏ ఇబ్బంది కలిగినా, తోటివారు వచ్చి సలహాలు అడిగితే తగినట్లుగా సహాయపడుతూ యుండ వచ్చును. వెంకటకృష్ణారావునకు ఒక కుమార్తె. ఇద్దరు కుమారులు, నా కుమారుడు చంద్ర శేఖరరావునకు ఇద్దరు మొగపిల్లలు ఆడపిల్లలు లేరు. పెద్దవాని పేరు ఉదయభాస్కర వెంకట రత్నగిరిరావు. ఇతడు ఇంజనీరు విద్య విశాఖపట్టణంలో ఆంధ్రా యూనివర్సిటీలో చదువు చున్నాడు. శ్రీరామచంద్ర వెంకటేశ్వరప్రసాద్ హైస్కూలులో చదువుచున్నాడు.

నా సంతానము, చంద్రశేఖరరావు వివాహము

ప్రపంచములో జనులందరకును తమ తమ పిల్లలకు పెండ్లి చేయుట ఒక సరదా. చంద్రం పందొమ్మిదివందల నలభై సంవత్సరం ఏప్రియల్ 8 వ తేదీ తెల్లవారితే 9 తారీఖు తెల్ల వారు ఝామున సుమారు 3 గంటలకి జన్మించాడు. అంతకు పూర్వము నాకు తొలి కానుపుకు ఒక ఆడపిల్ల పందొమ్మిది వందల ముప్పై యేడో సంవత్సరం డిశంబరు 22 వ తారీఖున జన్మించింది. ఆమె ఒక ఏడాదిపైన తొమ్మిది నెలలు జీవించి హఠాత్తుగా దూరమైపోయింది. అదివరకు నాకు దుఃఖమేమిటో ఎరుగని నాకు చాలా దుఃఖము కలిగింది. కాని ఆత్మ మాత్రము సుస్థిరముగా శాంతిగానే యున్నట్లు నాకు గోచరించింది. అప్పుడు ఇది యొక నాటక మనిపించింది.

నాటక రంగంలో నటన యెట్లాగో అట్లాగే దుఃఖించానని ఇప్పుడు అనిపించుతుంది. అప్పటికి చంద్రం పుట్టుకకు నెల తప్పినది. ఇంకను కొలది నెలలకే అతడు జన్మించాడు.

మా అక్కగారికి అదివరకే ఇద్దరు కుమార్తెలు పుట్టియున్నారు. మా యిద్దరికి పుట్టింటివారు పురుడు పోసేరు రెండు కానుపులకు ముగ్గురు ఆడపిలలు ఒక మొగపిల్లవాడు కనబడే వరకు మా అమ్మమ్మ దోనేపూడి సీతమ్మగారు చాలా సంతోషించింది. ఆమెకు మా అమ్మ గారు ఒక్కతే కుమార్తె అగుటచేత మొగపిల్లలు పుట్టారంటే ఆమెకు ఎక్కడ లేని సంతోషం కలిగింది. సరే ఆ ఆనందంతో పురుడు చేసుకొని ఇంటికి చేరుకున్నాము. తరువాత వరుసగా

ఇంకా ఇద్దరు మొగపిల్లలు ఇద్దరు ఆడపిల్లలు కలిగారు. ఒక కానుపు పోయింది. మొత్తం ఏడు కానుపులు. అందరిలో ఒక్క చంద్రం తప్ప అందరును కొన్నినెలలు రోగగ్రస్తులై మందులు ఎన్నో వాడిన తరువాత దూరమై పోయేవారు. చంద్ర ఆయుష్మంతుడై బ్రతికాడు. బుద్ధిమంతులలో ఒకడని అనిపించుకుంటూ బి. ఏ. ప్యాసైనాడు.

1958 సంవత్సరం ఏపియల్ 27 తారీఖున్న మునగలపల్లిలంక వాస్తవ్యులు కడియాల శివరామయ్య చుక్కమ్మగార్ల కుమార్తె చిరంజీవి అన్నపూర్ణాదేవితో, వివాహము జరిగినది. ఆమె మాతా మహులకు ఆరుగురు ఆడపిల్లలే. మొగపిల్లలు లేరు. ఒక్కొక్క కుమార్తెకు కొంత భూమినిచ్చి వివాహము చేసి అల్లుళ్ల నందరినీ ఇల్లరికం తెచ్చుకున్నారు. అందుచేత మా వియ్యంకుడు శివరామయ్యగారు, కృష్ణాజిల్లా కాటూరు గ్రామం నుండి తన మామగారింటికి వచ్చివేసినాడు. ఆయనకు ముగ్గురు కుమారులున్నూ, నలుగురు కుమార్తెలున్నూ కలరు. అందులో మూడవ కుమార్తె మా కోడలు అనుకూలవతి.

శరీర సౌందర్యం అందరూ కోరుకోవచ్చును. కాని దానికంటె ముఖ్యమయినది మనో నాగరికత. ప్రతివారికిన్నీ మనస్సు మంచిదయితేనే సుఖములను పొందగలుగుతారు. తన కోపమే తన శత్రువు తన శాంతమే తనకు రక్ష, దయ చుట్టంబౌ తన సంతోషమె స్వర్గము తన దుఃఖమే నరక మండ్రు తథ్యము సుమతీ. అని చెప్పారు గద. అదే గీతాచార్యుడు కూడ ఉద్ధరేదాత్మానామ్ నాత్మానమవసాదయేత్ అని చెప్పాడు కనుక ఎవ్వరయితే మానసికముగ నైతికముగ ముందుకు పోతారో వారే అగ్రగణ్యులు.

మా కోడలు అన్నపూర్ణ అత్తవారింటికి వచ్చిన తరువాత ఇప్పటివరకు మాకు అభిప్రాయ భేదములు కలుగలేదు. ఆడపిల్లవలెనే మెలుగుచున్నది. నాకు శారీరకముగా ఆరోగ్యము తక్కువ అందువలన ఆమె ఎంతో నన్ను కాపాడుతూ నాకవసరమైనవి సమకూర్చుతుంటుంది. నేనేమైనా అల్పంగాగాని పుస్తకములు వ్రాయునపుడు ఇంటి పనులన్నియును తానే చూచుకొంటుంది. అతిథి అభ్యాగతులు వచ్చినప్పుడు ఎంతగానో సత్కరించుతుంది. విసుగు అన్నమాట కనబడదు. మా అమ్మగారికి పక్షవాతము వచ్చింది. ఆమె సేవలో గూడ నాకు చాలా సహకరించుతుంది. కోడుకు కోడలిని జూచి మా ఇంటికి వచ్చినవారు కూడా ఆనందపడుతూ ఉంటారు నా కష్టమేమో ఇంటిలో యుండగా తెలియనే తెలియదు. ఇట్లే ఎన్నరోతా పనులను సరుకాని నా కెంతో సౌఖ్యము కలుగ జేసే ఇల్లాలు అన్నపూర్ణ. ఆధ్యాత్మిక జ్ఞాన సమాజ లో కూడ తోడుగా వుంటుంది. సతీ పతులకు దాంపత్యము కుదిరి అన్యోన్యాను పరస్పరానురాగము కలిగి ఏక మనస్కులై యుంటే, చూచువారలకు కూడ ఆనందము కలుగుతుంది గదా, అట్లుగాక ఎల్లప్పుడును అభిప్రాయభేదములు కలిగి తగవులాడు కొనుచుండుట చూస్తే ఆ గృహము యమలోకము వలె నుండునుగదా.

మా దాంపత్యములో చెప్ప తగినంత కష్టము గాని స్వర్గము గాని లేదని చెప్పవచ్చు. దాంపత్యములో యున్న సుఖము కనబడవలెనంటే, దాని ఆధిక్యత తెలుసుకోవలెనంటే, చిన్న చిన్న కలహాలు కలిగినప్పుడే ఆ సుఖము బోధపడగలదనియు పూర్తిగా అర్థమగుననియు

అన్నాడు ఒక కవి. అ ట్లే ఎప్పుడైనా కొలదిగా చిన్న చిన్న కలహములు కలిగిన ఆయనతో నాకు అపరి మితమైన బాధలు కలుగ లేదు. ఏ విధమైన పనులును సానుకూలము కాలేదని చెప్పుటలో అతి శయోక్తి లేదు. నా జీవితములో సంతానము నష్టమై పోయినపుడు బాధపడి ఆ పిల్లలకు వైద్యము నే నే చేయించి బాధ్యత వహించి బాధపడి వారు బ్రతుకనప్పుడు విచారిస్తూ యుండెడిదానను. ఆ విచారము లో భాగం ఆయన కు ఉండే దేమో గాని ధైర్యం తో నే సహించటం జరిగేది.

మా తల్లి దండ్రుల దాంపత్య జీవితం చెప్ప నలవి కాదు. అయిన నూ కొలదిగా చెప్పుచున్నాను. వారికి ఐకమత్యముండేదికాదు. మా నాన్నగారు మహా కోపిష్టి. సంతానము మీద ప్రేమ గూడ యెరుగనివాడు అని మనకు అనిపించుతుంది. ఆయన మనస్సులో ఏముం డెడిదో మనకు తెలియదు పితృ ప్రేమ యెట్టిదో ఆయన బ్రతికుండగానే మేమెరుగము.

మా మాతా మహి దోనేపూడి సీతమ్మగారే మాకు కావలసినవన్నియు సమకూర్చి ముఖ్యమైన సౌకర్యములు సమకూర్చెడిది. మా అమ్మగారు మామూలుగానే మాతృ ప్రేమతో యుండెడిది. తండ్రిగారికివారి చెల్లెలు వారి తల్లిమీద ప్రేమయే కాని, మామీద లోపల ఏమయిన ప్రేమ యున్న దేమో తెలియదు. మాకు కీడు ఆయన వలన జరిగినదని అనుకోలేము. మేము పుట్టినింట్లో ఆహారము కావలసినది తీసుకొని బ్రతికితిమిగాని, మినహాయి అన్నియు సీతమ్మగారే సమకూర్చుతూ యుండటమే.

మా అమ్మగారిపైన కూరలు వగైరాలకు ఎన్నియో కేకలు వేసేవారు. పైసకూడ ఆమెకు ఎప్పుడును ఇచ్చేవారు కారు ఆ బాధ పెట్టేస్వభావము చూస్తే మాకు చాలా కష్టంగా యుండెడిది. ఆ రోజులలో ఆడపిల్లలకు కట్నముల బాధ తక్కువ. ఆస్తులకే ప్రాధాన్యత ఇచ్చేవారు. చదువులకంటె ఆస్తి కూడా ఉండాలని భావించేవారు. విద్య, ధనములలో ఏది కావలయుననెడు సమస్య వస్తే ఆస్తినే ఎన్నుకొనేవారు.

కొంతభూవసతి యున్న ఘంటశాల వాస్తవ్యులు గొర్రెపాటి రత్తయ్యగారి కుమారుడు బాపనయ్యగారితో ప దొమ్మిదివందల ముప్పైఆరో సంవత్సరములో ఏప్రియల్ నెలలో నాకు వివాహము జరిగినది.

మానాన్నగారికి ఈ సందర్భంలో రెండువేలు వరకట్నం పైగా అయిదు వందలు పెండ్లి ఖర్చులు అయినవట. ఎంత తేలికో చూడండి. ఆ విధంగా నా పెండ్లి జరిగినతర్వాత మా అత్త మామలు అప్పటికే చనిపోవుట చేత వెంటనే కాపురానికి వచ్చాను. మాకు ఒక ఆడపడుచుయున్నది. ఆమె అంతవరకు మా ఆయనను వాళ్ళ తండ్రిని కూడ చూచింది.

వాళ్ళ తండ్రిగారు నన్ను తన కొడుకుకి సంబంధం ఖాయం చేసుకున్న తర్వాత హఠాత్తుగా చనిపోయాడు. తర్వాత వివాహం జరిగింది. మా అక్క గొర్రెపాటి నాంచారమ్మ గారు నన్ను ఆదరించుతూ ఉండేది. నేను వచ్చిన తర్వాత ఆడపడుచు వారి అత్తవారింటికి వెళ్ళింది. వెంటనే తదుపరి మంచి చెడ్డలు మా పిన్నత్త లక్ష్మమ్మగారు చూచేది. తర్వాత

మా అమ్మమ్మ సీతమ్మగారే నన్ను ఆదరించింది. కానుపుల విషయమై నేను కష్టపడినపుడు సీతమ్మగారే ఆదరించేది. కొన్నాళ్ళకు మా తమ్ముడు పెద్దవాడయాడు.

వెంకట కృష్ణారావు పెండ్లి సమయము వచ్చినది. అతని పెండ్లికి కుటుంబములో కొన్ని విభేదాలు వచ్చినవి. మా తల్లి గారు లేకుండగనే వివాహము జరిగినది. మేము కూడమమ్ములను పెండ్లికి పిలువక పోవుటచే వెళ్ళలేదు. అమ్మమ్మ వెళ్ళలేదు. అతనిని ఎంతో ప్రేమతో పెంచినది. గాన ఆకష్టమును సహించలేక కొలదికాలము బ్రతికి మాఅమ్మమ్మ మాఇంటివద్దనే రక్తపోటు వ్యాధితో చనిపోయింది. ఆసమయంలో మాతమ్ముడు మాఇంటికి వచ్చాడు తరువాత మాచిన్న అమ్మమ్మ మహాలక్ష్మమ్మకు పిల్లలు లేకపోవుటచేత మాఅమ్మ మీద ప్రేమ. ఆమెకు పెంకుటిల్లు కొంత ఆస్తియున్నది.

ఆపెంకుటిల్లు అమ్మకు వ్రాశింది. ఆఇద్దరు ఆఇంట్లో యుండేవారు ఆమహాలక్ష్మమ్మ ఆస్తి, మాతమ్మునికే నెమ్మదిమీద మేము దరము మాఅక్కతో సహాప్రయత్నము చేసి వ్రాయించాము వాడికే ఆస్తి దక్కినది.

తగవులు వచ్చిన కొన్నాళ్ళకు మానాయినమ్మ చనిపోయినది. వెంటనే మానాన్నకు జబ్బుచేసినది. మాఅక్కను నన్ను ఆయనను చూసిరమ్మని మాఅమ్మ ప్రోత్సహించింది. అప్పటికి మేము పుట్టినింటికి వెళ్ళి పదునాలుగు సంవత్సరాలైనది. మేమిరద్దము వెళ్ళాము. మానాన్న యథావిధిగ పలుకరించాడు ఆయన అనారోగ్య స్థితిని చెప్పాడు. కాని మమ్ములను చాప వేయించి కూర్చోమనిగాని ఒక్కరోజు యుండమని కానికోరలేదు. వచ్చివేశాము.

కొన్నాళ్ళకు మరల జబ్బుచేసింది. మరల చూడటానికి వెళ్ళాను. అందరును బాగుగా నున్నారా? యనికుశల ప్రశ్నలతో మొదలుపెట్టి మాటల సందర్భంలో మాఅమ్మను గర్వవతిగా స్పష్టించి మాట్లాడితే నేనుసమ్మతించలేదు. అందుచేత కోపగించుకుని నీకునేను రెండువేలిచ్చి పెండ్లిచేశాను నామీదనీకు విశ్వాసములేదు అని అన్నాడు. నాకు కష్టమనిపించింది.

పితృహృదయం బిడ్డలను జూచిన జాలిపడుతూ వుంటుంది, వారికి ఎక్కడ కష్టము కలుగుతుందోయని, జాగ్రత్త పడుతూ యుంటుంది. ఈయనకు అటువంటి పద్ధతి ఏమియు కనబడ లేదు సరి గదా విశ్వాసము నాకు లేదని వాపోవుట సరిగా లేదు. అసలు విశ్వాసం చూపించక అతనికి నేను చేసిన అపకారమేమిటి? అని బాధ పడ్డాను. అతడు కొంతకాలానికి స్వర్గస్థుడయ్యాడు.తరువాత మా తమ్ముడు మేము బాగానేయుంటున్నాం. వాడు మా ఇంటికి వస్తాడు మేము వాళ్ళింటికి వెడతాం. అందరివలెనే క్షేమముగా ఉంటున్నాం.

నేను జన్మించిన సుమారు 10 సంవత్సరాలకుగాని వాడు పుట్టలేదు. మా అక్క పెండ్లి అప్పటికే అయిపోయింది. మంత్రిపాలెం గ్రామవాస్తవ్యులు చిగులూరి వెంకయ్యగారి కుమారుడు దశరథరామయ్యగారితో వివాహం జరిగినది. అప్పటికి వారికి ఎక్కువకట్నమిచ్చేడి వారున్నారు. మా అక్కగారే కావలెనని చేసుకున్నారు ఆమెకు తమ్ముడనిన అధిక ప్రేమ.

తనకు పుత్రసంతానం లేదు తన సోదరునికి పెద్దకుమార్తె నిచ్చి రెండవపిల్లను మామూలుగా కట్నమిచ్చి వివాహం చేసి తనకున్న ఆస్తి అంతయు తమ్మునకివ్వవలెనని ఆమె ఆసక్తి.

మానాన్నకు తన చెల్లెలు మీద ప్రేమ. ఆమె భాగ్యవంతురాలు. ఆమె పిల్లను చేసుకొనవలెననెడు ఆపేక్ష యున్నది. అయిననూ ఆమెకు మగపిల్లవాడున్నాడు అతనిని రామరత్నం అంటారు. అతనికి ఆ గొప్ప ఆస్తి యంతయును ఇవ్వవలయునని వారి కోరిక. ఆడపిల్లకు మామూలుగనే కట్నమిచ్చి వివాహం చేసారు.

జీవులు జన్మాంతర కర్మ ఫలం చేత ఉద్భవించుతూ ఉంటారు. కర్మ ననుసరించియే జన్మకలుగుతుందనుటలో సందేహం లేదనిపించింది. అట్లే ఎవరి సుకర్మననుసరించి వారికి భోగములు కలుగుతాయని పెద్దలు చెప్పుతారు. పెద్దవారిని చేయవలెనన్న చేయలేరు. వద్దన్న ఆపలేము. కర్మననుసరించిజీవులకు సుఖదుఃఖములు అభ్యమవుతాయిగదా నాకు చిన్నప్పటినుండి సమాజములంటే చాలా యిష్టం. సంఘసేవలంటే చాలా సరదా. భగవద్భక్తి పుట్టుకతోనే వచ్చిందా? అనునట్లు ఆసక్తిదాయకముగా యుంటుంది. భగవంతుడే ప్రాణికోటి రూపముగ కనబడుచుండెనని పెద్దలు చెప్పినమాటలయందు విశ్వాసం మెండు.

అందువలన భగవంతుని ప్రార్థించుకుంటూ సంఘ దురాచారములను పెంపొందింప చేసుకొని దురాచారములను ఖండింపవలెనని కోరిక యుండెడిది.

మానవ సంఘంలో స్త్రీల దుస్థితిని గూర్చి ఎక్కువగా చింతించేదానిని. ఇంట్లో మా అమ్మగారి ఇబ్బందులను గమనించుటవలన అట్టి చింతన కలిగినదనుకుంటాను. స్త్రీ సమాజసేవ చేయటానికి మహిళా సమాజాలు స్థాపించుట మంచిదని తలచాను

ఇంతలో గృహలక్ష్మి పత్రిక మద్రాసులో కేసరి ఆధ్వర్యమున నడుచుచున్నదని తెలిసింది. ఆ పత్రిక చందా కట్టవలయును గదా. ఆడబ్బును మా అమ్మను అడిగి కట్టుటకు ప్రయత్నించితిని. పేకేటి రంగారెడ్డి అను పేరు గల ఆయన రాజ గ్రామంలో యుండేవాడు. అతను మానాన్నగారికి పరిచయస్తుడు. అందుచే నాన్నగారి దగ్గరకు వచ్చేడివాడు అతని వలన గృహలక్ష్మి పత్రిక చందా కట్టించితిని ఆ పత్రికలో స్త్రీల స్వాతంత్ర్యమును గురించి యెక్కువగా వ్యాసాలు వ్రాసేవారు. కథలు కూడ యుండేవి అవి చదివి అర్థం చేసుకుంటుండేదానిని పెండ్లి అయి ఘంటశాల కాపురానికి వచ్చిన తర్వాత మహిళా సంఘాన్ని స్థాపించాలని కోరిక కలిగినది. కిసాన్ వెంకట సుబ్బయ్యగారి భార్య సరస్వతమ్మకు నేనంటే చాలా అభిమానంగా ఉండేది కవివెంకట సుబ్బయ్యగారి కుటుంబమ్మగారు కూడ నాతో బాగానే ఉండేవి. వారితో సమాజస్థాపన విషయమై ఆలోచించాము. శకుంతలా, నేనున్నా. వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ అప్పుడు కృష్ణాజిల్లా మహిళాసంఘం ప్రెసిడెంటు అని చెప్పారు. ఆమెను ఘంటశాల మహిళా సంఘం నెలకొల్పుటకు రమ్మని ఉత్తరం వ్రాశాను. ఆమె వెంటనే ఒక ఉత్తరం వ్రాసింది వారం రోజులలో వస్తామనియు, మా గ్రామంలో వెంటనే సంఘం ఏర్పాటు చేస్తామనియు తెలిపింది సంతోషించాము. వారం రోజులుకాగానే ఆమె వచ్చింది. సమావేశం ఏర్పాటు చేశాం ఆ సంఘ అధ్యక్షురాలిగా నేనే యున్నాను. సహాయ ప్రెసిడెంటు కార్యదర్శులుగ సరస్వతమ్మ కుటుంబమ్మగారలను ఏర్పాటుచేశారు శకుంతల సహాయ కార్యదర్శిని

వేమూరి పేరయ్యగారి భార్య సరోజనమ్మ దోనేపూడి వెంకటకృష్ణయ్యగారి భార్య సీతామహాలక్ష్మమ్మవారి ఆడపడుచు వేమూరి చంద్రావతమ్మ దావులూరి లక్ష్మీశ్వరమ్మ. దోనేపూడి ద్రౌపదమ్మ గోరంపాటి బాపనమ్మ (మునసబుగారి భార్య) సభ్యులుగా ఉన్నారు. సమావేశమునకు తాత్కాలిక ప్రెసిడెంటుగా మునసబుగారి భార్యే యున్నారు. వల్లభనేని సీతామహాలక్ష్మమ్మగారు ఉపన్యసించారు. స్త్రీలకు పురుషులతోపాటు హక్కులే గాక సంఘములో కొన్ని దురాచారములను నిర్మూలించాలని చెప్పింది అప్పుడు కొందరు పురుషులకు అహంభావము కలిగింది. స్త్రీల హక్కులు కలిగితే భర్తకు కంచములో అన్నము కూడ పెట్టరని అచ్చటచ్చట చెప్పుకోవడం మొదలు పెట్టారు. స్త్రీలపై ధ్వజమెత్తాలని వారి కోరిక. అయినను మేము జంకలేదు.

సంఘములో కొందరిని ప్రాథమిక సభ్యులుగా చేర్చుకొని పావులా చందాదారులుగ సంఘమును ప్రతిష్ఠించాము కొన్నాళ్లు జరిగింది. ఇంతలో కమ్యూనిస్టులు చెలరేగి వారి స్త్రీలతో చాలామందిని ప్రాథమిక సభ్యులుగా చేర్పించి, గరికపర్రులో సభ జరిపించి, కమ్యూనిస్టు స్త్రీలే అధ్యక్ష కార్యదర్శులుగా యెన్నుకోబడినారు.

అంతటితో వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ మహిళా సంఘాలలో పని చేయుట ముగించింది. మేము కూడా ఆమెతోపాటు కొంత కాలము పని నిలిపివేసాము.

మరి కొంతకాలమునకు ఉద్దుగంటి వెంకటరత్నమాంబ మహిళా సంఘములను నెలకొల్పి అఖిలభారత మహిళాసంఘమునకు అనుబంధంజేసి సభలు జరిపించుట ప్రారంభించింది. మేము ఆసభలకు హాజరవుతూ వచ్చాము. ఘంటశాలలో దివితాలూకా మహిళాసభ జరిపించాలని ప్రయత్నించి ఆమెకు ఉత్తరం వ్రాసాము ఆమె జిల్లాసభలు జరిపించమని కోరింది. కిసాన్ వెంకటసుబ్బయ్యగారితో ఆలోచించాం ఆయన దయార్ద్రహృదయులు, ఆమె కోరితే రాష్ట్రస్థాయిలోనే సభలు చేయించండి, ఒకరోజు కృష్ణాజిల్లా మహాసభలున్నూ రెండవరోజు ఆంధ్ర రాష్ట్ర మహిళాసభలు చేయించండని సలహాయిచ్చారు. అట్లైనని చందాలు వసూలు చేయ తలపెట్టాము. ఆయన ఒక కార్యకర్తను మావెంట పంపించి కిసాన్ నాయకులనందరిని అడుగమని చందాలు వసూలగునని చెప్పారు. అట్లే అభ్యర్థించాము. అందరు నారికితోచిన రీతిని ఇచ్చారు. కె. రామసుబ్బమ్మగారు, భారతీదేవిగారు, కె. లక్ష్మీరఘురామ్‌గారు, అప్పటి కృష్ణాజిల్లా మహిళాసంఘ కార్యదర్శిని మనోరమగారు ఇంకాకొందరిని ఆహ్వానించాం. వారందరును విచ్చేసారు సభకుకావలసిన పందిళ్ళు మొదలైన ఏర్పాట్లన్నియు మా మొగవారు పట్టించుకొనకపోయిననూ, అపర రైతుబాంధవుడు కిసాన్ వెంకటసుబ్బయ్యగారే పట్టించుకుని అన్నియు సప్లయ్‌చేశారు. సభలు దిగ్విజయంగా జరిగినవి. కవి వెంకటసుబ్బయ్యగారి కుమార్తె, సుగుణకుమారి, కిసాన్ వెంకటసుబ్బయ్యగారి కుమార్తె అన్నపూర్ణ సేవచేసారు. అంతకుముందే మా మహిళామండలి గాంధి, కస్తూరిబాయి విగ్రహములు సెంటర్‌లో వేయించవలెనని సంకల్పించాము కస్తూరిబా విగ్రహం గోరంపాటి సీతారామయ్యగారి భార్య తులశమ్మగారే వేయించింది. గాంధి

విగ్రహం స్త్రీలపై చందాలు వసూలుచేసి వేయించాం. తరువాత ఈడ్పుగంటి రత్నమాంబ కొన్నాళ్ళు ఇట్లే మహిళాసంఘాలలో పనిజేసిన తరువాత ఆమె స్వర్గస్థురాలయినది. మేము మహిళా సంఘములలో జోక్యం కలుగజేసికొనలేదు.

తర్వాత కొంతకాలమునకు జిల్లాపరిషత్, తాలూకాసమితులు ప్రభుత్వంవారే ఏర్పాటు జేసారు. అందులో మహిళామండలులు స్థాపించుటకు వ్యాప్తి చేయూత నిచ్చుటకు జియస్. ఎమ్ఎస్ అని మహిళా సేవకులను నియమించారు. వారువచ్చి మహిళా మండలులను ఏర్పాటు చేయవలెనని ప్రోత్సహించగా మరలా మహిళామండలి అప్పటిసమితి ప్రెసిడెంటు మండవ వెంకటేశ్వరరావును పిలిచి బి.డి.ఓ గారిని రావించి ఒకవిందుచేసి వారి ఆధ్వర్యంలో మండలిని ఏర్పాటుజేశాం. ప్రెసిడెంటుగా నేనే నియమితురాల నయ్యాను. కార్యదర్శిగా అట్లూరి జయలక్ష్మమ్మ (డాక్టరుగారి భార్య)కోశాధికారిణి గొర్రెపాటి కరుణ (పేరయ్యగారి కుమార్తె) ఎన్నుకోబడినారు. మరికొంతమంది సభ్యులను ఎన్నుకొన్నాం. అప్పుడు కుట్టుసెంటరు మిషన్ పెట్టవలెనని సంకల్పం కలిగింది. ఎమ్.ఎస్. సుగుణగారితో అప్లికేషన్ కూచిపూడి సమితికి పంపించాం. (అప్పుడు కూచిపూడి సమితిగాయున్నది. తరువాత మొవ్వసమితి అయినది)

వెంటనే భటపెనుమర్రు మహిళా సమితివారుకూడా అప్లికేషన్ పెట్టారు. వ్యా పురుషులుగూడ పనిచేయుటచే ప్రెసిడెంటువారికే పెద్దసెంటరు ఇచ్చారు. మనకు ఇవ్వలేదు. నాకు నష్టంకలిగింది. అప్పుడు ఉషాకంపెనీ మిషన్ వాయిదాలపద్ధతిని తీసుకొని వారినే కుట్టుటీచరుని కూడా పంపమని కోరినాము. వారు ఒకటీచరును పంపించారు ఆటీచరుపేరు రుక్మిణి ఆమె వివాహము అప్పటికి కాలేదు. నేను ఆమెను మాయింట్లోనే బిడ్డవలె భావించి భోజన సదుపాయాలు జేసి ఆమె జీతంకొరకు, నెలకు అయిదురూపాలుకట్టి నేర్చుకోమని చెప్పాను. మహిళా సంఘము వారు అందులకు సమ్మతించి అయిదురూపాయలుకట్టి నేర్చుకున్నారు. ఒక్కొక్క సభ్యురాలు నెలకు అయిదురూపాయలు ముందుగనే కట్టేవారు. యాభైమంది ట్రయినింగ్ నేర్చుకున్నారు. తర్వాత మేము సమితిని ఏమియు సహాయమడుగలేదు.

ఆ ఎమ్.ఎస్. మారింది ఇంకొక ముఖ్యసేవికురాలు వచ్చినది. ఆమెపేరు చంద్రలీలమ్మ. ఆమెచాల సుగుణవతి. దైవభక్తికలది ఆమె ఎవరివలననో లోగడజరిగిన విషయముగ్రహించి మా ఇంటికివచ్చి మీకు సమితికి అప్లికేషన్ ఇప్పుడు నాచేతికియిస్తే తప్పక మీకు పెద్దకుట్టుమిషన్ సెంటరు యిప్పిస్తామనిచెప్పి నాచేత అప్లికేషన్ వ్రాయించి తీసుకొనివెళ్ళి సమితిలో ఘంటసాల మహిళామండలికి శాంక్షన్ చేయించింది, అప్పటికి వెంకటేశ్వరరావు వెళ్ళిపోయి ఇంకొకరు సమితి ప్రెసిడెంటుగా వచ్చారు వారు ఇచ్చారు.

అప్పుడు కుట్టుశిక్షణ నూరుమంది ట్రయినింగు పొందారు. తర్వాత ఇంకొకసంవత్సరం ఆపాఠశాలను పొడిగించమని అప్లికేషన్ పెట్టగా మరలరెండవ సంవత్సరం పొడిగించారు. గొర్రెపాటి భారతలక్ష్మి, వేమూరి సుగుణ గొర్రెపాటి రాణీప్రమీల, లీల,రాజేశ్వరి సభ్యురాండ్రుగానున్నారు. మరొక ముప్పయిమంది శిక్షణపొందారు. వీరందరును ఉచితముగ శిక్షణబొంది చాలమంది కుట్టుకొనుచున్నారు.

తరువాత వసుంధరాదేవి (ఘంటశాల పంచాయితీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారి భార్య, ప్రోత్సాహములో వైర్ వర్క్ సెంటరుపెట్టి ట్రయినింగ్ ఒక నలభైమందికి ఇప్పించాము. కుర్చీలు మోడాలు టీపాయిలు మామూలుబుట్టలు సైకిలుబుట్టలు అల్లుట నేర్చుకున్నారు. వేమూరి సుగుణాంబ వెంకటరత్నంగారి భార్య ప్రోత్సాహముతో గ్రంథమండలిని స్థాపించుటకు సమితికి అప్లికేషన్ పెట్టాము. అర్ధవిరాళముమీద రెండువందల రూపాయలు పుస్తకాలు కొన్నాము. కృష్ణాజిల్లా స్త్రీ సాంఘిక సంక్షేమ శాఖాధికారిణి రామకృష్ణమ్మగారి ఆదరణతో మరల రెండువందలు గ్రాంటు సంక్షేమశాఖవారు ఇచ్చారు ఇంకా గ్రంథములను కొని వృద్ధి చేశాము.

పిండివంటల తయారి పథకంలో సమితివారు గ్రాంటుయివ్వగా పిండివంటలు తయారుజేసి వారమునకొకసారి మహిళలము సమావేశమై పంచిపెట్టేవారము

తర్వాత నవ్వారుమగ్గములు సమితి అర్ధవిరాళముతో తెప్పించి వేములపల్లి మహిళా మండలి ప్రెసిడెంటు శకుంతలమ్మ సహకారంతో టీచరుని రప్పించి ట్రయినింగ్ ఇప్పించాము కొంతమంది నేర్చుకున్నారు.

పంచాయితీ ప్రెశిండెటు ;

ఈవిధముగ మాచేత నైనంతవరకు మహిళామండలిలో పని చేస్తూవచ్చాము. అప్పుడు వేమూరిప్రపుల్ల నావెంటనుండి నాకు కార్యదర్శిగా పనిచేస్తూయుండేది. ఇట్లుండగా పందొమ్మిదివందల యాభైయేడో సంవత్సరములో పంచాయితీ ఎలక్షన ఘంటశాల గ్రామమునకు వచ్చినది.

అన్ని గ్రామ పంచాయితీలకు, సమితులకు, పరిషత్ లకు అన్ని ఎలక్షన్ లు వచ్చినవి. దైవవశాత్తు ఆఎలక్షన్ కో ఆఫ్ మెంబరుగా నన్నుతీసుకొని ప్రెశిడెంటుగా యెన్నుకొన్నారు. దానిలో నాచేతనైనంతవరకు సదుపాయములు చేయవలయునని నాతలంపు, ఎలాగో వ్యతిరేకశక్తులను అధిగమించి, కొన్నినూతులు, సెప్టిక్ దొడ్లు, కట్టించాము. బజారులకు రబ్బీసు పోసేముందు మట్టి పోయించితేగాని బాగుండదని అన్నిబజారులకు మట్టిపోయించి మెరక చేయించాం. మెయిన్ రోడ్డుకు కంకరపోయుటకు ఇనస్పెక్టరు జనరల్ దగ్గరకు హైదరాబాద్ వెళ్ళాం. ఆయన స్త్రీ ప్రెసిడెంట్లను గుర్తించి గ్రాంటులు మంజూరు చేయించారు. నేను జేసెడీకాలంలో యెనమండుగురు స్త్రీలు పంచాయితీ ప్రెసిడెంటులుగ వచ్చారు. భట్లపెనుమర్రు, అంగలూరు, గుంటుపల్లి, కాటూరు ప్రెసిడెంట్లు నాతో స్నేహంగా యుండేవారు. వారందరితో కృష్ణాజిల్లా ప్రెసిడెంట్లు మహాసభలు జరిగెవి ఆసభలకు హాజరయ్యేవాళ్ళం అందరము సఖ్యతగానే యుండేవాళ్ళము. కాని ఘంటశాల గ్రామంలో వ్యతిరేకత యెక్కువగా యున్నది. అంతియేగాదు పాలనాధికారములోనున్న పార్టీకంటె ఇతరపార్టీలవారు అధికంగా పంచాయితీ పెసిడెంట్లుగా వచ్చారు. అందువలన రాజకీయయెత్తులువేసి ఒక సంవత్సరం యెనిమిదినెలలకే మరల ఎలక్షన్ తెచ్చారు. అప్పుడు ఘంటశాలలో పంచాయితీ ఎలక్షన్ జరుగకుండా రాజీ పడ్డారు. రాజీమీద దోనేపూడి సీతారామయ్యగారు యెన్నుకోబడ్డారు ఆయన వలన కొన్ని పనులు జరిగినవి.

తరువాత మరల ఎలక్షన్‌లో ఆయన వదులుకున్నారు. పంచాయితీ వ్యవహారములు నేను పట్టించుకొనలేదు. గ్రామస్థులే అప్పుడు ఎన్నికయిన ప్రెసిడెంటుగారలే చూచుకొనుచుండే వారు. నేను ఆధ్యాత్మిక జ్ఞానసమాజ పనులనే సాధ్యమైనంత వరకు చూచుచుండెడిదానను. ఏ పనులు చూచినను దైవము మీదనే భారం వేసి చూచుచుండెడిదానను.

కొంతకాలమునకు ప్రెసిడెంటుకు ఆయుష్షు తక్కువై ఒక రోజున అకస్మాత్తుగా గుండె జబ్బుతో మరణించాడు. మరల ఆ స్థానపు ఎలక్షన్‌లో వారివలెనే వీరు కూడా నిలబడి వారిని ఓడించి వీరే ప్రెసిడెంటు అయ్యారు. అవన్నియును ఉపద్రష్టగా జూచి ఊరుకున్నాను. క్రిందట జరిగిన ఎలక్షన్‌లో ప్రచారం చేసిన దానను ఈ ఎలక్షన్‌లో నేను ప్రచారం చేయలేదు. ఆ స్థితి నాకు బాగుగా నుండలేదు. ప్రజాస్వామ్యమని తెలివి లేని ప్రజలకందరికి ఓటు హక్కు నిస్తే మన దేశంలో పేదరికంతో అసూయాభావాలు తలెత్తుటచే డబ్బుకు భ్రమిసి అర్హతానర్హతల విమర్శనలేకయే ఎవరినయినా ఎన్నుకొనుటచే లంచగొండితనంతో అహంభావంతోను దేశం పతనమయిపోయిందిగదా అని పూర్వము ఆధ్యాత్మిక సంపద కలిగి, ధర్మనిరతులై యున్న ఈ దేశం ధర్మచ్యుతియై, బాధపడుచున్నదని చింతించాను.

దానితో ఘంటశాలలో కలి ధర్మములు పూర్తిగా ప్రవేశించినవి వర్గభేదములు, కుల భేదములు, కుటుంబ భేదములు కలిగినవి చివరికి ఆధ్యాత్మిక జ్ఞానసమాజంలో కూడ ఆ భేదం పైకెక్కినది.

## ఆధ్యాత్మిక జ్ఞానసమాజము

ఆధ్యాత్మిక జ్ఞాన సమాజమును వేమూరి ప్రఫుల్ల గొర్రెపాటి సరస్వతమ్మ గొర్రెపాటి కుటుంబమ్మ కంఠంనేని లక్ష్మీకాంతమ్మ ఇంకా మరికొంతమంది కలిసి నాఆధ్వర్యాన స్థాపించవలెనని సంకల్పించిరి. తాడేపల్లి పెద్దాశ్రమంలోయున్న చిన్నరామదాసుగారినితీసుకొని వచ్చి, ఆయనతో పదిరోజుల ఉపన్యాసములనిప్పించుకొని ఒక సమాజం ఏర్పాటు చేశాం. ఆ సమాజం మొదట ప్రఫుల్ల పుట్టినింటివారికి వేరుగా పేరమ్మ ఇల్లు అని వుండేది, ఆ యింట్లో కొన్ని దేవుని ఫోటోలు పెట్టి పూజలు చేసి భజనలు చేయించుచుండేవారం. దీనికి గొర్రెపాటి సుబ్బమ్మ, బుల్లెమ్మ ప్రసన్నమ్మగారలు తప్పక వస్తూవుండేవారు. కంఠంనేని లక్ష్మీకాంతమ్మ ఎప్పుడూ సమాజసేవ చేస్తూనేయుండేది. వేమూరి సీతమ్మ, అమ్మాయమ్మగారలు వస్తూ ఉండేవారు ఈసమాజమునకు అధ్యక్షురాలను నేనే. కారదర్శిని వేమూరి వెంకటరమణమగారు గొర్రెపాటి సరస్వతమ్మగారున్నూ వచ్చేవారు. భజనకు చిట్టెమ్మ అధ్యక్షత వహించి అందరికీ పాటలు నేర్పుతూ ఉండేది. నేను నాకు తెలిసినంతవరకు భారత భాగవత రామాయణాది గాథలు చెప్పుతూ యుండేదానను. ఎవరయినా పెదలు వచ్చినప్పుడు వారినిఆహ్వానించి గౌరవించి వారిచ్చిన ఉపన్యాసములను విని సంతుష్టి చెందేవారం. అట్టి ఖర్చులుకు మా సమాజం వారే ఇవ్వతగినవారము. అంతా విరాళము ఇచ్చేవారము. ఇంకా అభిమానుల మీదకూడ వసూలు చేసేవారం. దీనికి కంఠంనేని లక్ష్మీకాంతమ్మగారు బాధ్యత వహించేది. అవసరమయితే పురుషులు కూడ సహాయం చేస్తూనేయున్నారు.

ఒకసారి ఆశ్రమంలోని నవగ్రహపూజలు యేడురోజులు దంపతులు పీటలమీద కూర్చుని చేయవలెనని సంకల్పించాం. ఘంటశాల మగవారికి రాజకీయాలంటే ఇష్టం పూజలంటే చేయరు అందుచేత పిరికితనం కలిగి భగవంతుని స్తుతించాం. ఆయన దయ వలన యేడురోజులు దంపతులు విధిగా పూజచేశారు. సంతోషించుచూ ఈ విధముగా తలకొక పనీ చేసేవారము. మళయాళ స్వాములవారు ఈ ప్రాంతమునకు వచ్చినపుడు సమాజమునకు తీసికొని వస్తూండేవారము. ఆయన కు మా సమాజమంటే చాలా ఇష్టం. ఘంటశాలకు రాజకీయం అంటే సరదా, వేదాంతం ఎరుగరు. అట్టి గ్రామంలో మీరు వేదాంత సమాజం స్థాపించుట చాలా యుత్తమం. సంతోషం. అంటూ యుండేవారు. ఇప్పుడు ఆయన శిష్యులు, పీఠాధిపతులు, విమలానంద విద్యానంద స్వాములవారలు కూడ సమాజమునకు వస్తూ బోధించుతూ యుంటారు.

ఈ సమాజమునకు మూడు కుంటలు భూమి యున్నది. కార్యదర్శిని వెంకటరమణమ్మ నేను. సమాజం మీద కొన్ని చందాలు వసూలు చేసికొంత మేము ధనం విరాళంగా యిచ్చి పెట్టుబడి పెట్టి ఈభూమి కొన్నాం.

పాలెం. తాడేపల్లి మఠములకు ఒక్కొక్కరు ఒకకుంట భూమి చొప్పున కొంతమంది దానం చేసారు. అందులో ఫలితం ఆయా మఠములకు వాడుకొనుచున్నారు. మా ఆశ్రమమునకు ఎవ్వరూ భూమిని ధర్మం చేసినవారు లేరు. మాలో ఎవ్వరును ఇవ్వతగినంతగా త్యాగధనులు కనబడలేదు. ఇట్లుండగా మళయాళ స్వాములవారి సంప్రదాయకములో ప్రతి సంవత్సరం సనాతన వేదాంతసభలు ఎచ్చటనో ఒకచోట జరుపుతూ ఉంటారు. ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క పట్టణంలోకాని, ఒక్కొక్క పల్లెలోకాని జరుపుతారు. అందులకై అచ్చట స్థానికులే స్వాములవారిని మా గ్రామంలో సభలు జరిపించమని ఆహ్వానించేవారు. అప్పుడు వారికిష్టమయినవారికి అవకాశం ఇస్తూఉంటారు. అట్లే ఘంటశాలలో ఆధ్యాత్మిక జ్ఞానసమాజం వారికి సనాతన వేదాంత సభలు జరుపవలయునని సంకల్పం కలిగింది.

అందులకై ఘంటశాలపాలెం వారు మంత్రిపాలెం మా అక్కగారు అమ్మాయిలతో వైదికగా వారు కూడా ప్రోత్సాహమిచ్చారు. అంతేకాదు, ఈ సభల విషయమై చాలా గ్రామములవారు సహాయపడాడిరు. చందాలు వసూలు చేయుటకు ముందు అప్పటి వ్యాసాశ్రమపీఠాధిపతి విమలానందస్వాములవారికి సభలు జరుపుటకు అవకాశమిమ్మని ఆహ్వాన పత్రము వ్రాసి హైదరాబాదు జిల్లాలో సభలు జరిగే చోటికి పంపమని చెప్పారు అట్లే పంపినాము కాని ఇంకొక సంవత్సరం హైదరాబాదు జిల్లాకే ఇవ్వవలెనని వారు వెనుకబడియున్నారని చెప్పారు. సరేనని మేము ఊరుకున్నాము. ఆయా జిల్లాలవారు మరల సభలు జరుగునని అడిగియుండను. అందువలన మానికొండవారు అడిగినారని వారికి ఇచ్చారు అంటే ముందు సంవత్సరం జరుపబోయే సభ ఈ సంవత్సరమే వారికి అనుమతి పొందాలని వారి సాంప్రదాయం. దాని ప్రకారం మానికొండవారికి యిచ్చారు. నాకీ విషయం తెలిసి బాధపడ్డాను. ఆయనను ఇంక అడగవద్దని అనుకున్నాను. ఆ విషయం తెనాలి తాలూకా దోనేపూడి వాస్తవ్యులు వీరమాచనేని వెంకటరామయ్యగారు తెలుసుకొని వ్యాసాశ్రమ స్వామికి ఉత్తరం వ్రాశారు. ఆయన కూడా బాధపడి మానికొండ సభలో ఘంటశాలవారు అడిగితే వారికే ముందు జరుగబోవు సభలు యిస్తా

మని చెప్పినారు. నాకు ఉత్తరం కూడా వ్రాశారు. మేము మానికొండ సభలకు వెళ్ళి ఆహ్వా
నించాము ఇ. కా ఆరుగ్రామస్తులు ఆహ్వానించారు కాని ఘంటశాలవారికే ఖాయం చేశారు.
చందాలు వసూలు చేశాము. అప్పుడు ఆంధ్రోద్యమం తెలంగాణాఉద్యమాలు జరుగుచున్నాయి.
అందువలన ఆర్. టి. యస్. బస్సులు తిరుగుటలేదు. ఎట్లా సభలు జరుగుతాయా అనుకుంటూ
దైవంపై భారం వేసి ప్రయత్నం చేస్తున్నాం. అప్పుడే మా అక్కగారు చిగులూరి వెంకట
రత్నమ్మగారు గుండె జబ్బుతో మరణించారు. మానసికబాధ నాకు అధికమై శరీర బాధలు
వచ్చాయి. మాకు ముసలితల్లి యున్నది. ఆమెకు పెద్ద బిడ్డ పోగా నా అనారోగ్యమునకు
చాలా చింతించింది. కాని కొంతకాలం తగ్గి మరల కొంచెం ఆరోగ్యం చేకూరినది. దైవము
మీద భారం వేసి ప్రయత్నం చేస్తూనే యున్నాము పందిరులు వేయుటకు లక్ష్మీ పెరుమాళ్లు
అనే ఆయనను స్వామి పంపించారు. కాని అప్పటికే విమలానందస్వామికి జబ్బుచేసి మద్రాస్
హాస్పటల్‌లో వైద్యం చేయించుకుని ఆశ్రమం చేరుకున్నారు. ఆ లక్ష్మీ పెరుమాళ్లు ఘంటశాల
వచ్చారు. స్వామి వ్యాసాశ్రమంలో హఠాత్తుగా కన్ను మూశారు. అన్ని మఠములవారికిని ఈ
విషాదవార్త ఫోనులలో తెలియజేసిరి. మాకు అయోమయమైపోయింది.

చింతల చలమయ్యగారి వద్దకు కబురు చేశాము. మా మేనల్లుడు వెంకటరత్నం
వెళ్ళాడు. మనమేమి చేయవలయునో తెలియుటలేదు. మీరు ఆశ్రమమునకు వెళ్ళితే
వాళ్ళతో చెప్పండి అని వారికి తెలియబరచగా వారు ఈ రాత్రికి చిన్నకారుమీద బయలు
దేరి వ్యాసాశ్రమానికి వెళతామని చెప్పిరి. ఆకారు ఘంటశాలకు రానీయమని చెప్పివచ్చాడు.

ఆకారుమీద నేనున్నూ, వేమూరి యశోదమ్మ, గొర్రెపాటి ప్రసన్నమ్మ సుబ్బమ్మ
గారలు బయలుదేరి వెళ్ళాము. చింతల చలమయ్యగారున్నూ, ఆయన భార్య సీతామహ
లక్ష్మమ్మ కూడా మాతో బయలుదేరి వచ్చిరి. లక్ష్మీ పెరుమాళ్లు కూడ మాతో ఉండిరి. ఆ
రాత్రి తెల్లార్లూ ప్రయాణం చేసి మర్నాడు పదకొండుగంటలకు ఆశ్రమం చేరాము. అప్పటికి
అంత్యక్రియలు జరిగిపోయినవి. విమలానందస్వామి చెల్లెలు తిరిగి ఇంటికి వెళ్ళుతూ ఉన్న కారు
మాకు కనబడింది. పలికరించాం.

మేము వ్యాసాశ్రమం వెళ్లేసరికి విద్యానందస్వామిని పీఠాధిపతిగా నియమించి లోగ
డనే విమలానందస్వామి వీలు వ్రాశారని దానిననుసరించి వెంటనే విద్యానందస్వామి పీఠాధి
పతిగా వచ్చినారనియు తెలిసినది. కాళీబుగ్గలో స్నానం చేసి ఆయన దర్శనానికి వెళ్ళితిమి.
మా సభలు విషయం మధ్యాహ్నం నిర్ణయించి చెప్పుతానుచెప్పారు ఆ స్వామి.
సరేనని భోజనాలు అచ్చటనే పూర్తి చేసి అచ్చట జరిగే కార్యక్రమాలు చూసి
మధ్యాహ్నం సమావేశంలో పాల్గొనగా సనాతన వేదాంత సభలు ఆగేవి కావు తప్పక జరి
పించవలసినదే అని నిర్ణయించిరి. విమలానంద అధ్యక్షతను జరిగే సభలు దైవవశాన విద్యానంద
స్వామి ఆధిపత్యంలో జరుగునని తేలినది.

మేము బయలుదేరి ఘంటశాలకు వచ్చి సభాకార్యక్రమాలు సాగించాం. పందిరిలు
పాకలు దిట్టముగా వేయించడమైనది.

మొగవారు మగతోకి యిచ్చి వేయించినారు. గ్రామస్తులు మొగ పిల్లలు వడ్డించుటకు పూనుకున్నారు. ప్రయాణ సౌకర్యములు ఆంధ్రోద్యమ సందర్భమగుటచే సరిగాలేకపోయి నసూ ఎందరో జనులు హాజరైనారు. ఒక రోజు టైము ఉండగనే బయలుదేరి బడ్లమీద చిన్న కార్లమీద నడకతోను ప్రయాణము సాగించి అశేష ప్రజానీకము హాజరైనారు.ఎంతో ఓపికతో ఘంటశాల ప్రజలు వారిని సత్కరించారు,కార్యకర్తలకు బాగుగా సభలు జరిపించారని పేరువచ్చింది. చాలా సంతసించాము

లెక్కలు అప్పటికప్పుడు తయారు చేయించి విద్యానంద స్వామితో చెప్పి ఖర్చులు పోను నూటయాభై మిగిలితే వారికి సమర్పించాము ఇంకను బియ్యం పప్పు వగైరాలు దిగడినవి. ఆ విషయం స్వామితో చెప్పి ఈ సమాజమునకు నిధిలేదు కాబట్టి ఇవి అమ్మి డబ్బు జేసి మేము దీనికి ఏదైనా ఏర్పాటు జేస్తామని చెప్పాము. ఆయన నవ్వి ఊరకున్నారు. వారికి ఖర్చులిచ్చి పంపించాము.

తర్వాత అవి అన్నియు అమ్మి డబ్బు చేసాము. సుమారు రెండువేల రూపాయలు వచ్చినవి. మేము ఇంకను విరాళములిచ్చి. ఇంకను వెంకటరమణమ్మగారున్ను నేనున్ను పెట్టుబడిపెట్టి ఈభూమిని ఏర్పాటు జేశాము. పంటలు వచ్చినపుడు శిరిసగము తీసికొని జమలేసుకునే లాగున ఏర్పాట్లు చేసుకున్నాము

అట్లే ఆధ్యాత్మిక కార్యక్రమములు జరుపుటకును నిత్యదీపారాధన చేయుటకును సభ్యులందరును చందాలువేసుకుని నిర్వహించే లాగున ఏర్పాటు జేసుకున్నాము.

నిత్య దీపారాధన చేయుటకు సాలీలు కేతన లక్ష్మీకాంతమ్మ ఆశ్రమములో యుండేది. ఆమెకు అన్నివిధముల చేదోడుగ కంఠంనేని లక్ష్మీకాంతమ్మ యుండేది వారిరువురును దైవవశముచే మరణించారు. అందువలనసమాజమునకు ఒక మనిషి కావలసి వచ్చింది.

నేను భగవంతుని ప్రార్థించాను. నీవు మాబుద్ధి వలన ఏర్పాటుజేయించిన సమాజమును అన్ని విధములనీవేరక్షించు కొనవలసినదిగాని మావలన ఏమియు కొనసాగదు, గానసీవే దిట్టమైన మనిషిని ఏర్పాటు చేయవలసినదిగ ప్రతిరోజూ ప్రార్థించే దానను

ఇంతలో ఘంటశాల పంచాయితీ ప్రెసిడెంటు న్నుమూయుటచే అస్థానే ఎలక్షన్‌వచ్చింది బండి లక్ష్మీనారాయణ ప్రెసిడెంటుగా ఎన్నికై మానసమాజములో గూడకొబ్బరికాయ కొట్టుటకు దేవుని పూజించుటకు వచ్చాడుఆ సమయంలో సంఘ ప్రెసిడెంటు నైననన్ను పూలదండ ఆయనకు ఇవ్వమని మానభ్యులలో కొంత మంది కోరారు ప్రెసిడెంటు నగుటచే తప్పక అందించవలసి వచ్చినది. పూలదండ అందించాను. ఈసమాజంలో కొంత మంది వ్యతిరేకపార్టీ వారుయుండుటచే వారికి కష్టమని పించింది. వారు ఈరోజు మొదలు ఈ సమాజమునకు రాబోమని ప్రకటించారు అది నాచెవులకుఅందినది. ఆధ్యాత్మిక సమాజములలో పార్టీలుండకూడదు. నేను పార్టీ పట్టుదలతో దండవేయలేదు సమాజ ప్రెసిడెంటు నగుటచే విజయము పొంది వచ్చిన వారికి సమాజం తరపున సత్కరించవలెను గనుక దండవేశాను. మీపార్టీ వారుగూడా ఒకప్పటికి విజయము పొంది వస్తే నేను దండ తప్పక వేస్తాను, ఇంటి దగ్గర పార్టీలున్నను ఆధ్యాత్మిక సమాజంలో పార్టీలు వద్దని పదేపదే చెప్పాను. కబుర్లు చేశాను! అవిషయము గుర్తించవలయునని చెప్పాను కాని వారి చెవికి ఎక్కలేదు, ఆపట్టుదలను వారు విడువ లేదు.

గీతా జయంతి పేర అప్పుడప్పుడు పెద్దలను ఆహ్వానించి సభలు చేయుట మాకుఅలవాటు. కానీ ఇబ్బందుల్లో అవి మాని వేశాము. ప్రస్తుతము ప్రతి సంవత్సరం మా సమాజ కార్యదర్శి

వేటూరి వెంకటరమణమ్మగారు గీతా జయంతి ఆశ్రమములో జేసి సంతర్పణ చేస్తారు. ఆ సంతర్పణకు ఎప్పటి వలె అందరిని పిలిపించింది. కాని వారు భోజనమునకు రాలేదు. సమాజము రెండు చీలికలైనది.

ఇట్లుండగా లింగాలసూర్యనారాణయగారు విజయవాద నుండి ఉత్తరం వ్రాసారు. సర్వోదయము పాత్రలు పంటకాల గ్రామములో పెట్టించ వలయునని, ఒకకార్య కర్తను పంపించుతామని తెలియపఅచారు. ఆఉత్తరం జూచి ప్రపుల్లతో ఆలోచించాను. మనగ్రాముంలో బుట్టలు పెట్టితే సర్వోదయం మనిషి ఒకమ్మాయి వస్తుంది మన ఆశ్రమానికి పని చేయుటకు అవకాశము కలుగుతుంద. నాలుగవ వంతు ఆదాయము దేవునికి తీసికొన వచ్చును అవి నిత్య దీపారాధనకు ఖర్చు చేయవచ్చునని అని ఆలోచించి దిట్టమైన మనిషిని పంపించ వలసినదిగా ఆయనకు జవాబు వ్రాసినాము. కొన్ని రోజులకు రామాను జంసుగుణాంబను పంపించారు. ఆమె సంగీత విద్వాంసు లేనట.

ఆమె ఏభజన పాటలు పాడినసూహార్ మణివాయించుతుంది ఏపాటయైనను చక్కగాపాడగలదు.

కనుక సమాజములో భజన చేయుటకు ముఖ్యముగా సహాయపడుచున్నది. దేవుని పూజలనిన ఆమెకు ఇష్టము అందుచేత ఆశ్రమములో నిత్యదీపారాధనకు పూజారి వలె ఉపయోగపడుచున్నది. సర్వోదయమునకు అదాయం బియ్యపుబుటలద్వారా వసూలుచేయుచున్నది; అందునాలుగవవంతు దేవునికి తీసికోనుటఒకపద్దతి లేకమూడు వంతులు ఆదాయము దేవునికి తీసికొని సుగుణమ్మ జీతము కారు ఖర్చులు వగైరాలు చెలించుట యొక పద్ధతి యున్నది.

ఆ పద్ధతులో మేము సుగుణాంబ జీతముకారుఖర్చులు పెట్టుకొని మూడు వంతులు దేవునికి తీసుకొని ఒక వంతు సర్వోదయమునకు ఇచ్చుచున్నాము. ఈ ఖర్చులు పోను మిగిలినవి దేవునికి తీసుకొని వాడుచున్నాము. నిత్యదీపారాధన ఖర్చులుకు వినియోగించుచున్నాము.

అందుచేత సమాజము బలహీనముకాకుండా దిట్టబడింది. మాకాళ్ల మీద మేము నిలుచున్నాము. ఇంతలో మరియొక సంకల్పము కలిగినది.

ఈ మానవజీవితమే సంకల్పములకు పుట్టినిల్లు, ఒకసంకల్పము కలిగిన మరియొకటి దానివెంట ఇంకొకటి సముద్రములో అలలు వలెమితిలేకుండా ఉన్నట్లేయీమనోసాగరమున ఈ కోర్కెలనే అలలకు మితిలేదు.

సమాజమునకు అది వరకు పెంకుటిల్లుయున్నది. అది దిట్టమైనదిగాదు. ఏదో కొద్దికలపతో పూర్వము ఇల్లు వేసినారు అది. సమాజమునకు కొన్నాము. అది ఊడదీసి డాబావేస్తే దిట్టముగా నుండునని కోరిక కలిగినది.

ఇది సమాజ సభ్యులకు వినిపించితిని. అందరుసమ్మతించారు. కాని కార్యదర్శిని రమణమ్మగారు ఇదివరకే రుణమున్నది గదా ఇప్పుడు ఏ ఆదాయముతో డాబాను నిర్మించాలని అన్నది ఆమె బాధ్యతఆమెను అట్లాఅనిపించింది. దానేపూడి సీతామహాలక్ష్మమ్మ వేమూరి సీతమ్మగారలు నాకు సహాకరించారు.

అది వరకు గల పెంకుటిల్లు విషయముచెప్ప వలయునుగదా.

అది గొర్రెపాటి రాఘవయ్యగారిది. వారిపెద్ద కుమారుడు వెంకటేశ్వరరావు వారి పెద్దలు సంపాదించిన స్థలములో కొట్లు కట్టించిదానిలో ఫ్యాన్సీషాపు పెట్టాడు.

దైవ వశమున వారి పెండ్లి అయిన తరువాత విజయవాడ వ్యాపార ఉద్యోగముల

నిమిత్తం కాపురమువెళ్లారు.

అది అమ్మటకు సిద్ధమైనట్లు తెలిసినది.అది ఆశ్రమమునకు కొంచే బాగుంటుందనిఅనుకు న్నాము. నేను ఆయనచేత కంట్రాక్టు వ్రాయించిరెండువందల రూపాయలుఇచ్చానుబయానాగా. రెండు వేలకు విక్రయించాడు. బయానా తీసికొన్న తర్వాత ఇంకా రెండు వందలు ఎక్కువ పెడతామని ఎవ్వరోవచ్చారు. కాని ఆయన జంక లేదు. స్త్రీలుభజనలు చేసుకొనుటకు కోరితిరి కా బట్టి మీాకే యిస్తానని కంట్రాక్టు వ్రాసినలభై రోజులలో క్రయధనం ఇచ్చిక్రయం వ్రాయించుకొనుడని చెప్పివెళ్లారు. అప్పుడు వెంకటేశ్వరస్వామిని ప్రార్థించాను, క్రయధనం విరాళముల మీాద వసూలైతే తప్పకుండా వెంకటేశ్వర ఆశ్రమమని పేరు పెట్టుతామని అనుకొని నిద్రించాను.

తెల్లవారితే యొక యుపాయము తట్టినది. స్త్రీలు డబ్బు అయితే యివ్వలేరు. ధాన్యం అయితే ఇస్తారని అనిపించింది వెంటనే మేము కొంత ధాన్యం వేసుకొని ఘంటశాలలో కూడా అడిగినాముకొందరు సహకరించారు. పొరుగు గ్రామస్థులుగూడ ఇచ్చారు. మొత్తం రెండు వేలఅ యిదువందలు వసూలైనవి. వ్రాత ఖర్చుతో సహా ఆశ్రమానికి వీలైనట్లుగా బాగుచే యించుటకు సరిపోయినది. వెంకటేశ్వర కృష్ణా శమమని పేరు పెట్టినాము.

ఆ ఇల్లు పెద్ద దిట్టమైనది కాదు. కనుక డాబాని నిర్మించా లని సంకల్పించాము. భగవం తుని స్తుతించాము. ప్రార్థించాము.

భగవంతునిమీాద భారంవేసి చందాలు వసూలుచేసి వేయగలమని తలచాము. ఆ భగ వంతుని దయవలన నిర్విఘ్నముగా డాబానిర్మించగలము. ఏసర్వేశ్వరుడు మనకు ఈ కోర్కెను కలిగించెనో అయనే అది సిద్ధింపజేయునని ధైర్యముగా అమెకు చెప్పితిని. అమె స్వభావము ఒకరుచెబితే వినగలిగిన మనిషికనుక ఒప్పుకున్నది. డాబానిర్మాణముకొరకు అందరము సిద్ధమై నాము. ఆ భారమంతయూ భగవంతునిపై వే- నామమాత్రముగ మా కనుకూలమైన వాళ్ళనే అడుగుటకు సిద్ధమైనాము.

ముందు మేము శక్తికొలది వేసుకొంటిమి. తర్మాత బంధువులను, మిత్రులను అడిగి తిమి. ఎవరికి తోచినకొలది వారు ఇచ్చినారు. ఆ విరాళములను సేకరించితిమి. కిసాన్ వెంకట సుబ్బయ్యగారి కుమారుడు కుటుంబరావు ఆశ్రమస్థలములో కలిసే స్థలము వారికున్నది. దానిలో నాలుగు గజముల వెడల్పు ఆశ్రమస్థలము బారున ధర్మముగ ఇచ్చినారు అందులో పూరిచావడి వేసియున్నది. అందులో ఒక గది యున్నది. ఈ గద వెడల్పున అశ్రమమునకు వచ్చినది. అందులో బాత్ రూంకట్టించియున్నది. అదికూడా వచ్చినదిః కాని ఆపైపున వంటగది వేయవలసి వచ్చినది. ప్రస్తుతం బాత్ రూంగనే యున్నది.

ఆ స్థలము కలియుటచే కొంచెము ఖాళీస్థలము ఏర్పడినది-దానికి కావలసిన ఇనుము సిమెంటు మొదలైన సరుకులన్నియు మా అబ్బాయి చంద్రశేఖరరావే తెచ్చేవాడు. ఆ బిల్లులు జాగ్రత్తగా మాకు అప్పగించేవాడు.

ఆ సమయంలో సిమెంటు ఆలస్యముగ అందినది. అవి సప్లయ్ అయ్యే సమయములో సర్వోదయ సేవాసంఘ కార్యదర్శి లింగాల సూర్యనారాయణగారు విజయవాడలో నుండుట చేత ఆయన సప్లయ్ చేసేవాడు. ఆయన ఋణము సమాజం తీర్చుకొనలేదేమో, మరికొంతమంది ఏవో కొద్దిపనులు మాకు సాధ్యముకానివి ఏ కూలీలనో కుదిర్చి చేయించేవారు.

డివి ఆదినారాయణ తాపీమేస్త్రీ. కొంచెము మజూరి తగ్గించి పనిచేయించాడు. వడ్రంగి కూడా అట్లే కొంచెము తగ్గించే చేసినాడు. అతనిపేరు వట్లూరి వెంకటేశ్వర్లు. అతడుకూడా మంచివాడు.

ఇట్లు దైవకార్యము దైవానుగ్రహముచేతనే మనుష్యులకు ఆదరణకలిగి పనిని చేసేవారు కాని కూలీలు మాత్రము వారికూలి పూర్తిగా చెల్లించేవారము. ఎట్లో దైవయోగము చేత పని పూర్తయినది. కాని వసూలైన ధనము చాలలేదు. కొంత ధనము పెట్టుబడిపెట్టి కట్టించితిని. అదివరకున్న ఇల్లు నూతన భవనము కట్టుటకై పడగొట్టితిమిగదా! ఇప్పుడు భవనం పూర్తిచేయకపోతే సమాజం ఆస్థి విధ్వంసం చేసినవాళ్ళమవుతాముగదా. అందువలన పెట్టుబడిలో పూర్తి చేయించినాము.

దైవశక్తి. ఎంత బిరీయమైనదో నేనే ఆశ్చర్యరపోయ్యాను అధికముగా నేను కష్టపడకదు.

నా అనుచరులు మాత్రము నేను డబ్బు పెట్టుబడిపెట్టి తిననియు మనము పెట్టకదు కదా శరీర కష్టమైనను చేయవలయున నెడు ఆతురతతో తమ తమ అనుకూలుర వద్దకు వెళ్ళి పొరుగు గ్రామాలలో గూడా పోయి తెచ్చారు.

ప్రఫుల్ల పువ్వమ్మ గంగమ్మ సుబ్బమ్మ ప్రోత్సాహముతో కొంత డబ్బు తెచ్చారు. ప్రసన్నమ్మ బుల్లిమ్మ దనమ్మ ధనంచూచి సంతోషించారు. ఆధ్యాత్మిక కార్యక్రమములకి ప్రతిదానికి వడ్లమూడి సుబ్బమ్మగారు చాల సంతోషించేది. ప్రఫుల్ల దగ్గర యుండి పని చేయించి కొన్ని లెక్కలు గూడా వ్రాసేవి. నా భారము నగము వహించింది. లెక్కలు ఆమె నేను గూడా పూర్తిగా వ్రాసాము.

ప్రవేశ మహోత్సవ సమయము వచ్చినది. ఎవరికి తోచిన కానుకలు. అ సమయములో జమఖర్చులున్నూ ఆశ్రమము కట్టించిన జమఖర్చులున్నూ లెక్కచూచుకోగా కొంత రుణమే తేలినది. కార్యదర్శిని రమణమ్మగారున్నూ నేనున్నూ వేమూరి ప్రఫుల్లన్నూ మూడు వంతులుగ ఆరుణమును జేసికొని పెట్టుబడిగా ఉంచి వడ్డీలేకుండా జేసి ప్రతి సంవత్సరం భూమిమీదవచ్చే ఆదాయమున్నూ ఎవరికి తోచిన ధాన్యంవారు విరాళములుగ యిచ్చి అన్నియు కలిపి వచ్చిన ఆదాయము మూడువంతులు జేచి ముగ్గురం రుణం తీరు వరకు పంచుకొని జమ వేసుకొన వచ్చునని నిర్ణయించుకున్నాము.

సమాజము వారినందరిని ఒక రోజున సమావేశము జేసి వారికి జమఖర్చులు. వినిపించి జమలు పోను ఖర్చులు చెప్పి ముగ్గురము పెట్టుబడి వడ్డీలేకుండా ఇచ్చే ఏర్పాటున్నూ మరల అందరము ధాన్యం రూపముగ వేయవలెననియు అవిన్ని ఏటా వచ్చే ఫలితము కలిపి ముగ్గురం తీసుకొంటే కొద్ది సంవత్సరములకి రుణవిముక్తి గలుగ గలదని చెప్పితిమి. అందరును హర్షించారు అట్లే చేస్తున్నాము.

కార్యక్రమములకు లోగడవలెనే ఖర్చులు సమాజము మీద విరాళములు వసూలుజేసి జరుపుచున్నాము. పొరుగు గ్రామస్థులు గూడా బిల్డింగు విషయమై సహకరించుచున్నారు.

అట్లు సహకరించిన దాతల పేర్లు రాళ్లపై చెక్కించాము. యాభై రూపాయలు యిచ్చిన వారిని రాళ్లపై చెక్కించి వేలు, వందలు, యాభై రూపాయలు ఇచ్చిన వారికి రాతిపై యున్నవి. ఇంకా తక్కువ ఇచ్చిన వారి పేర్లు ఎట్లా ప్రకటించాలని ఆలోచించాము. మినహా వారి పేర్లు ప్రింటు చేయించి ఫొటో కట్టించుదామని అనుకున్నాము.

లోగడనే ఎనిగళ్ళ వెంకటరత్నమ్మ ఆమె భర్త పేర భావి తీయించింది. ఇంతలో 1979 సంవత్సరం జనవరి నెలలోనే నాకు అరవై సంవత్సరములు నిండుచున్నవి. ఆ విషయం మాటలసందర్భంలో లింగాల సూర్యనారాయణగారితో చెప్పాను. ఆయన ఒకసావనీరు వేయిం చుదమని చెప్పారు అందుచేత ఈస్మృతిస్రవంతి వ్రాయుట సంభవించింది

స్నేహితులు:

గోరాపాటి సరస్వతమ్మ నిష్కపటమైన మనిషి. ఆమె హృదయములో ఏ విషయము గూడ దాగదు. నేనంటే అపరిమితమైన విశ్వాసము. నన్ను సోదరివలెనే ప్రేమించుచుతుంది. నేనుచేయ వలయునని ప్రతి కార్యమునకు ఆమె పూనుకొనేది. ఆమెభర్త కిసాన్ వెంకట సుబ్బయ్యగారు. నాకు తండ్రితో సమానంగా యుండేవారు. ఏ విషయమై సలహా అడిగిననూ వెంటనే తగిన సలహా ఇస్తూఉండేవారు సంఘ సహాయము ఏది కావలసివచ్చినా ఆయన అభ్యంతరం లేకుండా చేసిపెట్టేవారు. ఆయన రైతు సేవ చేస్తూ విజయవాడలోనే కాలము గడుపుతూఉండేవారు. అప్పుడప్పుడు ఘంటశాలకు వచ్చినప్పుడు నా ఆరోగ్యమును గురించి, కుటుంబ క్షేమమును గురించి సరస్వతమ్మగారిని అడిగితెలుసుకుని, మా దంపతులను పలకరించి వెళ్లుతూ ఉండేవారు ఆయన హృదయం రంగాజీ హృదయం ఒక్కటేననిపించేది. వారి అడుగుజాడలలో నడుస్తూ ఉండేవారు. వారు బ్రతకవలసిన రోజులున్నప్పటికీ మంచి పువ్వులనే కోయమన్నట్లుగా భగవంతుడు ఆయనను తీసుకొనివెళ్ళినాడా అనిపించుతుంది. సరస్వతమ్మగారు అతిథి అభ్యాగతిని సత్కరించుతుంది. అందరును వర్ధిల్లాలని కోరుకుంటుంది. ఆమెకు నేను గొప్పయని అతిశయము లేదు. ఎవరు ఏది చెప్పినను వింటుంది. నాకు ఏ కార్యములయందు గూడ చేదోడు వాదోడగా యుంటుంది.

వేమూరి పేరయ్యగారు నాకు సోదరునివలె యుంటారు. ఆయన చాలా సంవత్సరాల నుండి అఖిలభారత చరఖా సంఘమును నడుపుచున్నారు గాంధి సిద్ధాంతమంటె ఆయనకు ప్రేమ రైతులంటే చాలా ఇష్టం. రంగాగారిని అభిమానించుచూ యుంటారు. కిసాన్ వెంకటసుబ్బయ్య గారంటే చాలా ఇష్టం. సమాజ కార్యక్రమాలలో ఏమార్పు వచ్చిననూ సరస్వతమ్మగారున్నూ నేనున్నూ అడిగితే సుసంహాలిస్తూయుంటారు. ఆయన భార్య సరోజనమ్మ నేనంటే గౌరవముగా స్నేహంగా యుంటుంది మహిళామండలిలో పూర్వం సభ్యురాలుగా యుండే వారిదంపతులు నేనంటే చాలా అనుకూలంగా యుంటారు.

బందరు వాస్తవ్యులు అర్జా వెంకటేశ్వరరావుగారు ఆయన భార్య కూడా చాలా స్నేహంగా యుండేవారు. వెంకటేశ్వరరావుగారు చాల పవిత్రమయిన మనిషి ఆయన అందరిని నిష్కలంకంగా పవిత్రంగా పలకరించుతూ యుంటారు. ఆయన భార్య ఆదర్శవతి. మాకు ఆఖరులో 1952 సంవత్సరం. అక్టోబరు నెలలో యొకపిల్లవాడు జన్మించాడు. అతనికి జబ్బుచేస్తే డాక్టరుకు చూపించుటకు వారింటికి వెళ్ళాం. మమ్ములను ఎంతగానో ఆదరించి రాళ్ళపల్లి అచ్యుత

రామయ్యగారికి చూపించి చికిత్స చేయించుటకు తోడ్పడినారు. ఆయన రాష్ట్రపతి బహుమానం టీచర్లలో పొందాడు. ఇప్పుడు ఆయన స్వర్గస్తుడయ్యాడు. ఆయన భార్య కనిపించితే ఎంతో ఆదరణగా యుంటుంది. లింగం వీరభద్రయ్యచౌదరిగారు నాకు తండ్రివలె ఉంటారు. నేను వ్రాసిన ఉభయభారతి, భగవద్గీత కథాజ్యోతి పంపించగా అవిచదివి, ఎంతగానో అభినందించారు నేను ఆ పుస్తకములు వ్రాసినందుకు కవయిత్రిగా వర్ణించారు. ఆయన జీవితచరిత్రలో గూడ మా దంపతులను చంద్రశేఖరునిగూడ స్నేహితులుగా వ్రాశారు. ఆయనకు మాకుటుంబమంటే చాలా ఇష్టం. ఘంటశాలకు కవి వెంకటసుబ్బయ్యగారింటికి వచ్చినప్పుడు మా ఇంటికి కూడా వచ్చి మమ్మలను పలుకరించుతారు. ఆయనను బారిష్టరుగారంటారు కవికూడా. ఆయన మాకుటుంబంపై గల పవిత్రప్రేమకు ధన్యవాదములు.

లింగాల సూర్యనారాయణగారికి మేమంటే సోదరీ ప్రేమ ఉన్నది. ఒకసారి నేను ప్రఫుల్ల కలిసి గాంధి పర్వతంమీదకివెడితే ఎంతో గౌరవించిరి బ్రహ్మచారిణిలు వచ్చినప్పుడు మహిళా సభకు అధ్యక్షత వహించమని కోరారు, అధ్యక్షత నేను వహించాను.

సమాజ భవనం కట్టినపుడు ఆయన చేసిన సేవ మరపు రానిది ఆయన ఋణం తీర్చు కొనలేం. ఏవిషయమయినా ఆయనకు చెప్పితే కాదనకుండా సహాయం చేస్తారు. చర్ల పాపాయమ్మ జనార్ధన స్వామిగారలు కూడ మేమంటే ఎంతో గౌరవంగా యుంటారు. మేమొకప్పుడు బ్రహ్మచాణిలు వచ్చి వెళ్ళిన వెంటనే పాదయాత్ర ప్రకటించారు. గొర్రెపాటి వెంకట సుబ్బయ్య మా బావకుమారుడు బి. ఏ. చదివి ఆంధ్రా బ్యాంకిలో ఉద్యోగం చేయుచున్నారు. నేను చేయుకార్యక్రమములను విని చూచి సంతసించుతాడు.

## పాదయాత్ర

బ్రహ్మచారిణులు వచ్చినప్పుడు శ్రీయుత లింగాల సూర్యనారాయణగారు మమ్మలను పాదయాత్ర చేయమని ప్రోత్సహించారు. నేనున్నూ గొర్రెపాటి సరస్వతమ్మ వేమూరి ప్రఫుల్ల, వేమూరి యశోదమ్మ దోనేపూడి కోటేశ్వరమ్మ కాట్రగడ్డ దనలక్ష్మమ్మ కమ్మ సరమ్మ పాద యాత్ర చేశాం. భజనమాష్టారు కూడ మాతో యాత్ర చేశాడు. ద్రౌపదమ్మ గూడ మాతో ఉన్నారు. అట్లూరి జయలక్ష్మమ్మ సరోజనమ్మ దోనేపూడి సీతామహాలక్ష్మమ్మ మొదలయిన వారు మేము ఏఊరయినా వెళ్ళినప్పుడు అచ్చటికి వచ్చిచూసి వెళ్ళేవారు.

మొదట ఘంటశాల నుండి కొత్తపల్లి పాదయాత్ర చేశాం అచ్చట మునసబుగారి భార్య బసవపూర్ణమ్మగారింటివద్ద మకాం చేసి అచ్చట మా వేశం జరిపి భజనలు ఉపన్యాసములు ఇచ్చి సర్వోదయపాత్ర పెట్టి గుప్పెడు బియ్యం ప్రతిరోజు వేస్తే ఆ బియ్యం సర్వోదయము వారు తీసుకొనివెళ్ళి బీదలకు సదుపాయం చేస్తారు. ఒకవంతు మన గ్రామంలో పేదవారికిగాని దేవునికి నిత్యదీపారాధన వగైరాఖర్చులకు వినియోగించుకొటకు ఇస్తారు అని చెప్పాం. వారే భోజనసదుపాయం చేశారు. సిద్ధాశ్రమంలో గీత చదివి అల్పాహారం తీసుకున్నాము. అచ్చట

నుండి రెండవరోజు తాడేపల్లి రాజబాపయ్య సీతామహాలక్ష్మిగారింటికి వెళ్ళాం. అచ్చట మకాం చేసి స్త్రీల ఆశ్రమంలో భజనలు బహిరంగసభలు పెట్టాం. సర్వోదయ పాత్రనుగురించి చెప్పి ఆ రాత్రికి అచ్చటనే ఉన్నాం మూడవరోజున చిట్టూరు గ్రామాల పాదయాత్ర చేశాం.

అచ్చట రత్నగిరిరావుగారింట మకాం చేశాం అచ్చట భజనలు మీటింగు జరిపాము. సర్వోదయసిద్ధాంతం గురించి మనోనిర్మలతను గురించి చెప్పి అచ్చట విశ్రమించి నాలుగవరోజు పాదయాత్ర జేసి వక్కలగడ్డ చేరుకున్నాం. సీతారామయ్య భార్య రంగమ్మ ఘంటశాల ఆడపడుచు అగుటవలన వారి ఇంటిలో బస చేసి మహిళామండలి కార్యాలయంలో మీటింగ్ చేసి ఆరాత్రి రంగమ్మగారింటి వద్దనే యుండి వారి సత్కారణల పొందాం.

అయిదవరోజున పాదయాత్ర జేసి రామనగరం వెళ్ళాం. అచ్చట సీతారామమ్మగారు మనకు ముఖ్యమయినసనూ ఆమె గ్రామంలో లేనందున ఎవరును కొంత టైమ్ వరకు తెలిసికొన లేదు. తర్వాత అచ్చట మహిళామండలి ప్రెసిడెంటు తెలుసుకొనివచ్చి మమ్ములను ఆహ్వానించి మాకు భోజనసదుపాయం జేయుట ప్రారంభించగా సీతారామమ్మగారు కూడా వచ్చిరి. అందరును కలిసి మాకు తగిన ఏర్పాట్లు చేసిరి. రామాలయంలోనే భజనలు మీటింగులు పెట్టించాం. అందరూ సంతోషించిరి. అచ్చటనుండి లక్ష్మీపురం పాదయాత్ర జరిపాం. అచ్చట ఆగ్రామ కరణంగారు మమ్ములను భజనతో రామనగరంవచ్చి తీసుకొని వెళ్ళారు. చిట్టెమ్మగారు మాకు ఎంతో ప్రేమతో భోజనసదుపాయం చేసింది. అచ్చట దేవాలయంలో మీటింగు భజనలు పెట్టాం అచ్చట ఆధ్యాత్మిక సర్వోదయ విషయాలు చెప్పి తెల్లవారుజామున దాలిపర్రు పాదయాత్ర జేశాం. వారు కూడా మమ్మల్నెంతో గౌరవించి వారి ఆశ్రమంలోకి తీసుకొనివెళ్ళి భోజన సదుపాయంజేసి విశ్రమింపజేసిరి. స్నాన సంధ్యలు వగైరాలు ఆ ఆశ్రమా నికి ప్రెసిడెంటు తులశమ్మగారింట జేశాం. రాజేశ్వరమ్మరాధాకృష్ణయ్యగారి కోడలు మొదలైన వాళ్ళు సత్కరించగా అచ్చట భగవద్గీత బుర్రకథ మనవాళ్ళు కోటేశ్వరమ్మ ప్రపుల్ల,ధనమ్మ చెప్పిరి. భజనలూ మీటింగులూ పెట్టి వేదాంత సర్వోదయ విషయాలు చెప్పాం. వాళ్ళు సంతో షించిరి ఆ రాత్రి అచ్చట విశ్రమించి తెల్లారిసతర్వాత ఘంటశాలకు వచ్చాం. పాదయాత్రతో మేము వచ్చుటచూచి కోడళ్ళందరూ అత్యుత్సాహంతో ఆశ్రమంలో పూలదండలు మాఅందరికీ వేసి అచ్చట సర్వోదయపాదయాత్ర విషయములు చర్చించి ఆరోజు భోజనములు ఒక్కచోటనే మా ఇంటివద్ద జరిపించి పాదయాత్ర ముగించాము.

నాకు ఆఖరిసారి 1952 సంవత్సరములో ఒక పిల్లవాడు జన్మించాడని చెప్పాను. అతనికి కంటిజబ్బుగూడ వచ్చినది. తెనాలివెళ్ళి వెంపటి సూర్యనారాయణగారి వద్ద వైద్యము చేయించి నాము. కాని కన్ను రాలేదు. రెండవకన్ను పోకుండా మందులు వాడారు.

ఆయన వైద్యుడే కాకుండా ఆధ్యాత్మిక వేత్తకూడా. వినోబాజీ శిష్యుడు. సర్వో దయ నాయకుడు. మూడువేళలా దైవప్రార్థన చేస్తారు. తెల్లవారుఝామున 4 గంటలకు వారి ఆస్పత్రిలో మొదట ప్రార్థన చేస్తారు. మధ్యాహ్నం రెండుగంటలకు ప్రార్థన వుంటుంది. సాయం

కాలం నాలుగు గంటలకు ప్రార్థన చేస్తారు. ఆహారనియమము పాటించుతారు. ఖద్దరు బట్టలనే ధరించుతారు. ఆయన భార్యకూడ బంగారు ఆభరణములను ధరించక ఖద్దరు చీరలనే ధరించి వైరాగ్యము ఉట్టిపడేటట్లు ఉంటుంది. భర్తకు సహచారిణిగ ఆమెకు ఆమెయే సాటి. ఆదంపతులను జూచిన పూర్వపు ఋషి సాంప్రదాయము ఇట్లుండునని అనిపించుతుంది. ముక్తిని బొందవలయునంటే భార్యా బిడ్డలను త్యజించి అడవులకు బోనక్కరలేదు. వానితో నుండియే ముక్తిని సాధించవచ్చుననుటకు ఆదంపతులే నిదర్శనం. ఆయనచేత వైద్యం చేయించిన తరవాతనే మేము గీతాజయంతి ఘంటసాలలో ఆశ్రమవాసుల ఆధ్వర్యము క్రింద జరిపించుతూ ఆయనను కూడ ఉపన్యాసకుడుగా పిలిచినాము. మా మాటను మన్నించి వారు ఘంటశాలకు వచ్చి ఉపన్యసించారు. అప్పుడే ఆయన అనుచరులలో లింగాల సూర్యనారాయణ పరిచయమై సామ్యయోగ పత్రికల చందాలు వసూలు చేసేవారు. తర్వాత మిత్రుడై సోదర సమానులయ్యారు.

కాని మా పిల్లవాడు ఎన్ని వైద్యములు చేయించిననూ కర్మఫలము అనుభవించక తప్పదుకదా. కొంతకాలం బ్రతికి తర్వాత కన్ను మూశాడు. అంతలో నాకు విరక్తి పుట్టినది. శరీరం క్షణభంగురం. ఈ పిల్లలుకూడ శాశ్వతం కాదు.

ఈఅశాశ్వతమైన ప్రపంచంలో ఈబిడ్డలను మనసంకల్పం చేత సృష్టించి వారికి ఇంత శరీరబాధలు కలిగిస్తూ వారు బాధపడుతూ వుంటే మనం చూచి సహించుట చాలా కష్టం. గాన మనం ఇకముందు రోజులలో ఈకామ సంకల్పం రాకుండా చేస్తే మంచిదని ఆయనకు కూడా చెప్పగా ఆమోదించారు. అదిమొదలు ఇంద్రియ నిగ్రహంతోనే గృహ విషయాలలో ఎప్పటివలెనే నిర్వర్తించుచూ కాలం గడుపుచున్నామనుటలో సందియం లేదు. అప్పటినుండియు వేదాంత విచారణ చేశాం.

మళయాళస్వాముల వారిచేత నడుపబడుచున్న యదార్ధభారతి పత్రిక తెప్పించి చదివి అర్థం చేసికొనుటకు ప్రయత్నించితిని. భగవద్గీతా పారాయణచేస్తూ దాని తాత్పర్యములు చదివి అర్థం చేసికొనుట విశేషార్థములు చదువుటచే మనసులో నిల్వయున్నవన్నియు ఆధ్యాత్మికజ్ఞాన సమాజంలో చెప్పుతూ యుంటాను.

ఈవిధముగా సమాజం నడుస్తూ మళయాళస్వాముల వారుగాని వీఇతర ఆధ్యాత్మికవేత్తలుగాని, కమిలీబాబాగారుగాని వచ్చినపుడు వారిని ఆహ్వానించి వారిబోధలు వింటున్నాం. వ్యాసాశ్రమ నిర్మాతలయిన మళయాళస్వాముల వారున్నూ, వారి పీఠాధిపతులును అందరకు తెలిసినవారే గదా. వారిని వర్ణించుటకు నాకు శక్తి చాలదు. అందరికిన్ని తెలిసినవారే గదా, కమిలీబాబాగారు కొండపల్లెలో యుండేవారు అచ్చటనుండి ఇవుడు మొగల్‌రాజపురంలో ఆశ్రమం కట్టించి విజయవాడకు వచ్చారు. ఆయన ముఖ్యమైన ఆధ్యాత్మిక విషయాలు కొన్ని నాకు చెప్పారు. ఆయనకు అనుభవమైన విషయాలు సాధ్యమైనంతవరకు చెప్పుటకు ప్రయత్నం చేస్తారు. ఈ ఆత్మ విషయంలో ముందుకుబోవు మార్గం ఆయన వివరించారు.

ఓంకారస్వాములవారు తూర్పు గోదావరిజిల్లా శాంతి ఆశ్రమ నిర్మాతలు.

తపోధనులు. ఆరోగ్యం కోల్పోయివరితపించుచున్న వ్యక్తికాలు బాగుపడుటకుతనకాలి ఎముకను దానం చేసిన అపర దధీచి. అందరిని ప్రేమించుతారు. ఆ ఆశ్రమమునకు జ్ఞానేశ్వరి కార్యదర్శి. అచ్చట భక్తులందరును ఎంతగానో మనలనుగౌరవించి ప్రేమించి ఆదరణ చేస్తారు. పాఠశాలలను పెట్టించి ఎందరో బాలబాలికలకు విద్యనేర్పించి చాలసేవ చేయుచున్నారు. ఎప్పుడును రామనామమును కీర్తించుతూ వుంటారు. సత్సంగములను జేసి అందరకు ఆధ్యాత్మిక విషయములు సులభంగా బోధింతారు. శాంతి ఆశ్రమంను నేను రెండు మూడు సారులు దర్శించి ధన్యురాలనయితిని.

నిర్విషయానందస్వామి బ్రహ్మచారి. కవిత్వం వ్రాస్తారు. కొన్ని పుస్తకాలు రచించారు. మళయాళస్వాములవారి శిష్యుడు. అహంకారం లేని జ్ఞాని. నిరాడంబరుడు. ఆహార నియమం గలవాడు. అనుష్టానపరుడు. ఆయనకు పెన్మత్స యోగిని ఆశ్రమమును వ్రాసి ఇచ్చారు, అందువలన ఆశ్రమ అధిపత్యం వహించారు. ఆ ఆశ్రమమును బాగుచేయించినారు. వినయ సంపన్నుడు. క్రొత్తగా కట్టించిన ఆశ్రమంలో మళయాళస్వాములవారి ఫోటో ఆయనే ఆవిష్కరించారు.

నేను వ్యాసాశ్రమం వారికి లెటరు వ్రాస్తే చాతుర్మాసం మేము వచ్చుటకు వీలులేదు అన్నారు. లక్ష్మణయతీంద్రులను అడిగితే వారున్నూ ఏలూరులో చాతుర్మాస వ్రతం పెట్టినాం మేము రాలేమన్నారు. నిర్విషయానందస్వామిని అడుగగనే వారు ఇష్టపడి తనగురువుగారి ఫోటోను ఆయన స్వహస్తములతో ఆవిష్కరించారు. తర్వాత ఉపన్యాసమిచ్చి సంతుష్టాంతరంగుడయి మమ్ములను సంతసింప జేసారు.

రామదాసను భక్తుడు పెద్దాశ్రమంలోనే యుంటారు. ఆయన స్థిత ప్రజ్ఞుడనుటలో సందియంలేదు. ఆయన ఘంటసాలపాలెంలోనే జన్మించాడు. అచ్చటనే పెరిగి వయసు వచ్చిన కొలది భక్తుడై పెద్దాశ్రమంలో నివాసం పెట్టి మళయాళస్వాములవారి వద్ద ఉపదేశం పొంది తనదేహేంద్రియముల వశం జేసికొని స్థితప్రజ్ఞుడయినాడు. పీఠాధిపతులుకూడ ఆయన కుటీరమునకువచ్చి చూడవలసినదేగాని ఆయన వారి వద్దకురాడు. ఎప్పుడూ భగవంతునియందే మనస్సును లయంజేసి, కొంత సేపు ధ్యానం, కొంతసేపు జపం, కొంత ఆత్మానాత్మవిచారణ కొంతసేపు గ్రంధపఠనం కొంతకాలం ఉపన్యాసములతో కాలమును గడుపుతూ యుంటారు. ఆయన యథేచ్ఛగా భగవత్ కాలక్షేపం చేస్తూయుంటారు. ఆయనను చూచినపుడు పూర్వ జన్మలలోనే చేయవలసిన సత్కార్యములు చేసి యోగం శాలించుచు పూర్తికాకమునుపే యోగభ్రష్టుడయినందువలన ఇట్లు జన్మించెనేమో యని విదితమగుచుండును. ఆయన ఆధిపత్యంలోనే 1955వ సంవత్సరంలో ఆధ్యాత్మిక జ్ఞానసమాజం ఘంటసాలలో స్థాపించితిమి. కొంతకాలం అప్పుడప్పుడువచ్చి ఉపన్యాసమిస్తూ యుండేవారు. ఇప్పుడు ఎచ్చటికీ వచ్చుటలేదు. తన కుటీరంలోనేయుండి కాలం సద్వినియోగం చేయుచున్నారు. వారిని చాలామందిపెద్దలు గ్రామస్థులయిన వారు కలిసికొని వారి ఉపన్యాసములను విని సంతసించుచూ యుంటారు. అట్టి వారలలో తన అంత్యకాలంలో రామదాసుగారివద్ద కొంతకాలం మా నాన్నగారు కాల సద్వినియోగం చేశారు. అట్లే చాలామంది ఆయన దర్శనం వలను శాంతీ తృప్తి పొందుచున్నారు.

భజనబాబు భక్తుడు. నిరాడంబరజీవి. పాటలు పద్యములు శ్రావ్యంగా పాడుతారు. భగవద్గీత హరికథగా చెప్పతారు. అందు శ్రోతలకు తెలిసే విధంగా రమ్యంగా చెపుతారు. జ్ఞానం భక్తి కూడ కలుగునటుల బోధించుతారు. ఆయనకు తృప్తియున్నది. ఈయననిత్యజీవితమునకు సరిపోయే వస్తుసామాగ్రి యుంటే తృప్తిగా యుంటారు. సంతోషంగా యుంటారు. ఆయన జీవితమునకు తక్కువయినవికూడ కనబడవు. గృహస్తభక్తులు ఆయనకు కావలసినవి ఇస్తూనే ఉన్నారు. కనుక నిత్యతృప్తులయ్యే ఉంటారు. భక్తిప్రచారం హెచ్చుగా చేస్తారు. ఆయన మళయాళస్వాములవారి శిష్యులే అయియున్నారు. మాసమాజమంటే గౌరవముగా ఉంటారు.

నిత్యానందస్వాములవారు చాలా గంభీరం గల మనిషి. అఖిలాంధ్ర సాధుపరిషత్ కు అధ్యక్షులుకూడా. మేము ఘంటశాలలో కమిలీబాబాగారి అధ్యక్షతను మతమతాంతర సమిష్టి మహాసభలు జరిపించినపుడు వచ్చారు. మాఇంట్లోనే మకాం పెట్టారు. మాఆతిధ్యాన్ని పొంది సంతోషించారు. తర్వాత సనాతన వేదాంతసభలు విద్యానందస్వామి అధ్యక్షతను జరిపిచినపుడు కూడా వచ్చారు మాఇంటి దగ్గరేయుండి మాసపర్యనంది వెళ్ళారు. వృద్ధులు ఆరోగ్యం సరిగా యుండదు. మాచంద్రశేఖరం ఆయనకు కావలసినవన్నియు సమకూర్చుటచేత మంచివాడని మెచ్చుకొని మమ్మలను ఆశీర్వదించి కోడలనుగూడ దీవించి వెళ్ళారు. ఆయన ధ్యానపరులు ఎందరిచేతనో సాధువులచేత స్వాములచేత గౌరవము పొంది నిరహంకారముగ, గంభీరముగ యుండేవారు వారిని చూచినపుడు సముద్రము జ్ఞాపకం వస్తుంది. గంభీరముగా నుండి ప్రతి వస్తువును బయట పడేసినట్లుగ ఆయన గంభీరంగా నుండి హృదయంలో కపటంలేకుండా, ఎంతో దయాదాక్షిణ్యాలు కరుణ కలిగి సాధు రక్షణలతో కనబడుతూ ఉండేవారు. ఆయనకు శివరాత్రికి కాళహస్తీశ్వరునకు అభిషేకం చేయించమని మా అమ్మగారు కొలదిగా డబ్బు పంపించేది. ఎన్ని ఇచ్చినను తృప్తియే సంతోషం చెందేవారు. రూపాయలకుగాదు, భక్తి కావలయునని సంతసించేవారు. గర్వం లేకుండా పెద్దలు పిలిచినను పిన్నలు పిలిచినను హాజరయ్యేవారు తన సందేశాన్ని ప్రజలకందించి తృప్తి పడేవారు. ఆయన ఇప్పుడు మనలో లేరు. ముక్తులయినారు. ఆయన ఆత్మ సదా శాంతినంది మనలను ఆశీర్వదించుగాక.

రామకృష్ణానందస్వామి, విద్యాప్రకాశానందస్వాములు చతురతతో వేదాంతోపన్యాసాలు ఇస్తారు. వారి ఉపన్యాసములు విని సంతసించేదానను. స్వరూపానందస్వామి వలన శ్రీ హనుమాయమ్మగారు నాకు పరిచయమయ్యారు. ఆమె విజయవాడ వాస్తవ్యులు వారిది, అసలు కొమ్మమూరు.ఆమె ఇంద్రకీలాద్రి పర్వతంమీద విజయవాడలో బ్రహ్మంగారి మఠంలోమున్నది.

దుర్గామల్లిఖార్జునస్వామివారి దేవస్థానంలో దుర్గాదేవి ఆలయమునకు సమీపంలో ఒకగుహలో రెండు రేకులు వేసి దుర్గాదేవిఫొటో మల్లిఖార్జునస్వామిఫోటో బ్రహ్మంగారిఫొటో పెట్టి పూజలు చేస్తూయుంటారు. వారి గురువుగారి విగ్రహం పాలరాతితో చెక్కబడివున్నది ఆమె అచ్చట వుంటుందంటారు. నేనెరిగిన తర్వాత రేకులుపెద్దు రెండోది నిర్మించింది. వాళ్ళ అక్కగారి అబ్బాయిని తీసికొనివచ్చి పెండ్లి చేసినది. ఆదంపతులను తనదగ్గరనే ఉంచుకొం

టుంది. వారికి ఇద్దరు కుమారులు. ఈమెకు ఏదయినా పని కలిగితే ఏఊరు అయినా వెళ్ళితే అతడే పూజ చేస్తాడు. ఇపుడు కొండమీదినుండి క్రిందికి క్రిందినుండి కొండమీదికి ఒకవ్యాను తిరుగుతుంది దేవస్థానం వారిదే. ఆవాన్ మీద కండక్టరుగా వుంటున్నాడు. ఇట్లు ఆమె సంసారి వలె మనకు కనబడును. కాని ఆమె దుర్గాదేవి అనుగ్రహమున అప్పుడప్పుడు పసుపు కుంకుమ కర్పూరం అచ్చటికప్పుడు పుట్టించి మనకు యిస్తారు. ఒకసారి గారెలు వండి మాఆశ్రమంలో ఆమెచేత నైవేద్యం పెట్టించాం. ఆమె తల్లికి పెట్టినది ఆమె స్వయంగా కొరికి తింటుందట. ఒక టిఫిన్‌లో పెట్టి గారెలను నైవేద్యం చెల్లించినది. అక్కడనే యున్నాము కొంతసేపటికి చూస్తే అవి కొరకబడియున్నవి అవి చూస్తే మాకు విచిత్రంగా యున్నది. అదేవి మనకు కనబడకుండా మనఎదుట ఆరగించుట చూస్తే విచిత్రముగదా ఆశ్చర్యపోయాం. మనము చూచుటకు ఈనేత్రములు చాలవేమో వారు తినుట కనబడదు.

ఆ హనుమాయమ్మగారి భక్తి ఎటువంటిదో ఆదేవి మనఎదుట ఆరగించుట ఆదేవి మహిమ ఏమో తెలియక తికమకలవుతూ వుంటాముగదా. ఆహనుమాయమ్మగారు నన్ను తోబుట్టువువలె ప్రేమించుతుంది. నేనున్ను ఆమెను అట్లాగే ప్రేమించుతాను. ఆమెను ఒక కోమటి తన పుత్రికవలె ప్రేమించి కొంత బంగారం నగలు చేయించాడు చీరెలు తెస్తూఉంటాడు బియ్యం పప్పులు వగైరాలు చూస్తూ ఉండేవారు భక్తిని గురించిన గాథలు కబుర్లు చెప్పుతూ ఉండేవాడు. ఆయన ఇటీవలనే స్వర్గస్తులైనారు ఆమెకు సుబ్బారావు అని తోబుట్టినవారి వరుసన యున్నాడు ఆయన గూడా ఆమె అంటే చాలా భక్తిగా ఉంటారు గుడివాడ వాస్తవ్యులు శ్రీ రాఘవయ్యగారు ఒక బ్యాంకి ఉద్యోగి వీరు. డాక్టరు శివరామకృష్ణయ్యగారు హోమియో వైద్యములో గొప్పవారు రాష్ట్రపతి బహుమతిపొందారువీరు హనుమాయమ్మగారంటే సాక్షాత్ దుర్గాదేవి అని నమ్ముతారు ఇట్లు అనేకమంది భక్తులు ఉన్ననూ ఆమె నన్ను తోబుట్టువుగా ప్రేమించుతుంది. ఆమెను నేను కూడా ఆ విధంగానే ప్రేమించుతూ ఉంటాను. కమిలీబాబా దంపతులున్నూ మేమున్నూ ఒకసారి కాశీయాత్ర చేశాం అప్పుడు ఆంజనేయులు దుర్గాంబ ఆయన భార్య ఈ దంపతులు గూడా మాతో వచ్చారు. నేను ప్రఫుల్ల మా అక్క వెంకటరత్నమ్మ దేవరకోట చిట్టెమ్మ వెళ్ళాం. మాకు అండదండలుగాయుండేవారు. ఒకనాడు ఒకాయన మా ఇంటికి వచ్చాడు ఆయన పేరు సుబ్రహ్మణ్యశర్మ అని చెప్పినట్లుగుర్తు ఆయన పెరుగు పాలు త్రాగి ఉండేవాడు. అన్నం ఎరుగనే ఎరుగరు అయిదేండ బాలుడై యుండగాఇల్లు విడిచిపోయి ఆధ్యాత్మిక తత్వం తెలుసుకున్నాడట. హఠాత్తుగా వచ్చి మా ఆతిథ్యం వారం రోజులు చేసి వెళ్ళాడు. మరి కనిపించలేదు. వెర్రిమ్మ ఆమె తల్లి వెంకటసుబ్బమ్మగారలు కూడా వచ్చిరి. వాళ్ళది పెదపాలెం గుంటూరు జిల్లావాళ్ళు మేము ఒక గ్రూపుగా ఉండేవాళ్ళం. ఆంజనేయులు దంపతుల స్నేహం మరువలేం కమిలీబాబాగారి భార్య కూడ మేమంటే బాగా ఉండేది ఆమె ఇప్పుడు అనంతాత్మలో కలిసిపోయింది ఆంజనేయ దంపతులు యాత్ర చేసినప్పుడు పిల్లలు లేరు ఇప్పుడు కలిగిరి. వాళ్ళ భక్తిఅంతయు కమిలీబాబాగారిమీదనే ఉండును. వాళ్ళ జీవనభృతికయ్యే ఖర్చులపోను ఏమైనా మిగిలిన కమిలీ బాబాగారికే అర్పించుతారు.

వారికి మిగులుట మిగలకపోవుట బాబాగారి కృపనై ఉన్నదని వాళ్ళ నమ్మకం. జగదాంబ (మానికొండ) కూడా వచ్చినది. ఆమెకూడా బాబాగారికి ప్రాణమైయుండేది అంతటి భక్తులు వారు.

నారాయణచరణ్ వరదదాసుగారి అన్నకుమారుడు వరదదాసువలెనే కవి. మళయాళ స్వాములవారి శిష్యుడు. స్వాములవారి వ్యాసాశ్రమంలో నెలకొల్పిన పాఠశాలలో సంస్కృత విద్యార్థులలో ముఖ్యులుగా నలుగురు వుండేవారట. కృష్ణచరణ్, రామచరణ్, నారాయణ చరణ్ అనువారు. వారి మనస్తత్వము నిష్కలంకమైనది. వారి గుణగణములనుజూచి స్వామి ప్రేమించేవారు. వారి నలుగురికి అత్యవసరమైనపుడు నెల్లూరు అమ్మగారు అని ఒక సాహుకారు ఆమె డబ్బు ఖర్చుపెట్టేవారు. ఆమెకు ఒక కుమారుడు. ఆయన పేరు శ్రీనివాసులురెడ్డి. ఆయనకు చాలా మాతృభక్తి. తల్లియందు చాలావిశ్వాసం. ఆమెపేరు మన్నెం సీతారావమ్మగారు. ఆమెను అమ్మగారని పిలిచేవారు. వారు విద్యనభ్యసించిన తర్వాత మళయాళస్వాములవారి అనంతరం కృష్ణచరణ్ అనువారు వ్యాసాశ్రమ పీఠాధిపతి అయ్యారు. అప్పుడు విమలానంద స్వామిగా వ్యవహరించారు.

ఆయన అనంతరం అప్పటికే రామచరణ్ అనే ఆయన విద్యానందస్వామి అనుపేరుతో శివగిరి ఆశ్రమంలో వుంటూ ఇప్పుడు వ్యాసాశ్రమ పీఠాధిపతిగాయుండి ఆయనే వ్యాసాశ్రమం కార్యక్రమములు నిర్వర్తించుచున్నారు. శివచరణం ఒకమఠంలో వుంటున్నారు. ఈముగ్గురు సన్యసించారు. నారాయణచరణ్ గృహస్థుడయి నెల్లూరులో హైస్కూలు తెలుగు పండితుడుగ వుంటున్నాడు. కాని ఆయనకు మళయాళస్వామి అంటే అపరిమితమయిన భక్తిగా వుంటాడు. ఆయనకు ఒకకుమారుడు ఒక కుమార్తె.

కుమారుడు విద్యావంతుడయి ఉద్యోగం చేయుచు గృహస్థుడయినాడు. నీతి నిజాయితీగా వుంటాడని వాడుక. పుత్రిక ఆయుష్షులేక దూరమైపోయినది. అందువలన నారాయణచరణ్ దుఃఖించాడు. అయినను భక్తిజ్ఞానం గలవారలు కనుక వెంటనే మరల గురుధ్యానం చేయుచు తత్కాంతిగ కాలం గడుపుచున్నారు. ఆయన మానసమాజానికి అప్పుడప్పుడు వచ్చి ఉపన్యాస ములు ఇస్తూ వుంటాడు. ఇపుడు పెద్దవాడయినాడు నచ్చుటలేదు. వరదదాసుగారి భార్యా సావిత్రమ్మగారిని కూడా అంత్యకాలంలో ఆమెను తన ఇంటికి తీసికొనివెళ్ళి ఉపచారములుచేసి ఉపశమింపజేశారు. ఆమె పరలోకగతురాలయినది.

బందగు నక్కలతోట అమ్మగారిపేరు కనకలక్ష్మమ్మగారు. ఆమెకు రామకృష్ణపరమహంస అంటే చాలా ఇష్టం. ఆమెకు చాలామంది సంతానమున్నది. అయిననూ ఆమెకు శిష్యులున్నారు ఆధ్యాత్మికవేత్త. నూకలవారిపాలెంలో రామకృష్ణ సేవాసమితి "యను ఒకసమాజం స్థాపించారు ఆ శిష్యులు. ఒక ఆశ్రమం కట్టించారు. ప్రతిసంవత్సరం రామకృష్ణజయంతి చేస్తారు. నన్నుకూడా పిలుస్తారు. భజనలు, ప్రసంగాలు జేయించుతారు. నాకు వీలయినపుడు వెళ్ళుచుస్తూ వుంటాను. తోచినవి చెప్పివస్తాను. పూజలు జరుగుతాయి.

కనకలక్ష్మమ్మగారు సంసారి అయిననూ ఆమె హృదయంలో ఏసంసారం వుండదు. ప్రశాంతంగ వుంటుంది. ఆగ్రామస్థులే ఆకార్యక్రమములు నిర్వహించుతారు.

వెనిగళ్ళవారిపాలెంలో సుంకర కృష్ణమ్మ యనునామె ఒక ఆశ్రమం స్థాపించినది. ఒకసారి సభలు జేసి నన్ను పిలిచి బిరుదు యిచ్చి సన్మానించినది. ఆమె వృద్ధురాలయినది. ఆశ్రమ వాసిగా వుంటారు. బ్రహ్మచారిగారు లంకపల్లి ఆశ్రమంలో వుంటారు. వారు చాలా జ్ఞానులు. ఆయన వారి ఆశ్రమంలో ఒకసంవత్సరం ఏకనామం పెట్టిచారు. చాల ప్రతిభాశాలురు. ఒకసారి ఆధ్యాత్మిజ్ఞాన సమాజమువారు గీతాజయంతి సభలు చేయించినప్పుడు వారు ప్రసంగించారు ఇప్పుడు భగవద్గీత పదునెనిమిది అధ్యాయములు పారాయణము చేసి పదునెనిమిది సారులు హారతి ఇచ్చి దాని అర్థము యథాశక్తిని ప్రసంగించుచున్నాము. ఎవ్వరినిపిలచుటలేదు గాని వారికి మేము కృతజ్ఞులం.

లంకపల్లిలో మరియొక ఆశ్రమమున్నది. అందులో గోచి సాధువని అంటూ ఉండేవారు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు. విరాగి ఎప్పుడూ ఆయన ధోరణి ఆయనదే పసిపిల్లలు మాదిరి ఉంటూ ఉండేవారు. ఆయన చాటుకు పోయారు. ఇప్పుడు వారి భక్తులే ఆశ్రమమును నడుపుచున్నారు. ఆ గ్రామస్థులే ఆశ్రమమును నడుపుటకు సహాయపడతారు. కొంత భూమి యున్నది. అచ్చట చిట్టిమ్మ అండదండలుగా యుంటుంది.

కమిలిబాబాకు దోనేపూడి గ్రామస్థులు వారి కార్యక్రమములు జరుపుటకుఅండ చేస్తారు. వారు మత మతాంతర సమష్టి సభలు జరిపి ఎందరినో ఆహ్వానించుచు మమ్ములను కూడ ఆహ్వానించారు. వెళ్ళాం వీరమాచనేని వెంకటరామయ్యగారు, లక్ష్మీకాంతమ్మ, నాగేంద్రమ్మ చంద్రయ్యగారలు ఎందరో మర్యాద చేసారు. అచ్చట మళయాళ స్వాములవారి ఆశ్రమము ఉన్నది. అచ్చట నొక శిష్యుడు నడుపుచున్నాడు. కమిలీబాబాగారి అనంతమైన కృపచేత ఆధ్యాత్మికవిషయములెన్నో తెలుసుకొన్నాను. వారికి నామీద ఉన్న పవిత్రమయిన ప్రేమకు కృతజ్ఞులము. ఆయనని పూజ్యులుగా భావించుకుంటాం. ఇంక కమిలీబాబా సంఘంలో వారెందరో నన్ను ఎంతగానో గౌరవించుతారు. వారికి నా కృతజ్ఞతాభివందనములు. కమిలీబాబాకు నామనో వాకములు. రాజరత్నమ్మగారు మాకు దూరపు బంధువు మా అమ్మగారికి స్నేహితురాలు. ఆమె వయస్సులో ఉండగానే భర్త పోయాడు. పిల్లలు లేరు. ఆమె దుర్భరమైన శోకముతో ఉండగా మళయాళ స్వాములవారు ఘంటశాలపాలెం వచ్చినప్పుడు ఆయనదగ్గర ఆమె ఉపదేశం తీసుకొన్నది అప్పటినుండి అనుష్టానము బాగుగా చేసినది ఇరుగుపొరుగువారు వచ్చినప్పుడు వాళ్ళతో వేదాంతగోష్ఠి చేస్తూ ఉండేది. యదార్థభారతి పత్రిక తెప్పించి, తన దగ్గరకు వచ్చిన వాళ్ళకు చదివి వినిపించేది. ఆమె తాడేపల్లిలో ఒక స్త్రీల ఆశ్రమం నెలకొల్పినది.

ఆ ఆశ్రమంలోనే ఉంటూ మా సమాజములను చూచి సంతోషించెడిది. రజస్వలైన తర్వాత నేను అయిదు సంవత్సరములు వివాహము కాకుండా యున్నాను అప్పటి రోజులలో అల్లుండుల అరుదు. కనుక మా అమ్మమ్మతోను, అమ్మతోను ఈమెకు వివాహం చేయకుండ ఆశ్రమంలోనుంచి భక్తిమార్గములో ఉంచితే మంచిదని చెప్పేదట. కాని మా పెద్దవాళ్ళు అంగీకరించలేదు. తర్వాత వివాహమయిన కొన్నాళ్ళు సంసారంలోన గడిపి తర్వాత ఆధ్యాత్మికజ్ఞాన సమాజం స్థాపించితిమి. అప్పుడు రాజరత్నమ్మగారు నన్ను జూచి అమ్మా. నీకు వివాహం చేయకుండా భక్తిమార్గములో ఉంచమని మీ పెద్దవారితో అనగా నా మాటను అంగీకరించలేదు నీవువివాహముజేసికొన్ననూ భక్తిమార్గములోనే పనిచేయుచున్నావు. చాలా సంతోషకరమైన సంగతని తన సంతోషమును వెలిబుచ్చెడిది.

ఆమె తన ఆశ్రమాన్ని నడుపుతూ వృద్ధాప్యమున కొంతకాలమునకు కన్నుమూసినది. ఆమెకంటె పెద్దదివారి పెదతల్లి కుమార్తె తుమ్మల శేషమ్మగారు ఆమెకు సపర్యలుజేసి ఆమెను దాటించినది. ఇప్పుడు మైనేని సీతామహాలక్ష్మమ్మగారు (ఆమెఅక్క-కోడలు) రాజబాపయ్యగారు (ఆమెఅక్క-కొడుకు) న్నూ నిర్వహించుచున్నారు. మోతీలాలు దంపతులు. తుమ్మల నరసయ్య దంపతులు వారికి సహాయము చేస్తూయుంటారు. మా సమాజమునకు వారు వస్తూయుంటారు. వారి సమాజకార్యక్రమములకు మేమున్నూ వెడుతూయుంటాము. ఒకరికొకరు అనుకూలముగా యుంటాము.

పెద్దాశ్రమము చింతల చలమయ్యగారి ఆధిపత్యములోయున్నది. వారిబావగారున్నూ మరికొందరును కలిసి విరాళాలు వసూలు చేసి కట్టించారు. పెద్దతోటలో కొబ్బరిచెట్లు ఉసిరి చెట్లు, మామిడిచెట్లు, పూలచెట్లు ఉన్న దానిలో ఆశ్రమము నిర్మాణము చేసారు. ఆ ఆశ్రమము నడుపుటకు కొంతభూమి యున్నది. ఇచ్చట నున్న ఆశ్రమములోనికి పెద్దగాయుంటుందని పెద్దాశ్రమము అన్నారు. చలమయ్యగారు కూడా ఒక పెద్దమనిషిగదా నేనంటే చాలా గౌరవముగా యుంటారు.

యం. నాగరత్నమ్మ విజయవాడలో ప్రశాంతి గీతాశ్రమము స్థాపించారు. మళయాళ స్వాములవారి శిష్యురాలు. ఆ ఆశ్రమమును వృద్ధిచేయుచు విద్యానందస్వాములవారు వచ్చినపుడు వారిని ఆహ్వానపరచి ఆయనప్రవచనము వినుటకు భక్తులకు అవకాశము కల్గించుతారు. వార్షికసభలకు మమ్ములనుగూడా ఆహ్వానించారు. ఆమె రేడియోలో పనిచేస్తున్నారు.

దొండపాడు చిట్టెమ్మ గారిది దొండపాడు గ్రామమే. ఆమెకు ఇద్దరుకొడుకులు. ఆమె భోజనంచేయదు. బెల్లంతిని కొన్నాళ్ళున్నది. ఇప్పుడు పాలుత్రాగుతున్నది. ఆమె సనాతన సభలు ముదినేపల్లిలో చేయించినది. చందాలు వసూలుచేసి వేణుగోపాలస్వామి మందిరం కట్టించింది ఆమె, వాళ్ళ అక్క-కూతురు, వియ్యపురాలు భగవద్గీత బుర్రకథచెప్పుతారు. ఆమెకూడా మనసమాజమంటే గౌరవముగా ఉంటారు.

హనుమాన్ చాలీసా పారాయణము :-

మంత్రిపాలెం కొండపల్లి అనసూయ ఆధిపత్యములో భజనసమాజమున్నది. ప్రతి శని వారంనాడు భజనలు చేస్తారు మైకు సంపాదించుకున్నారు. గోపాలకృష్ణాలయములో కార్యక్రమములు జరుపుకుంటారు.

ఒకసారి లక్ష్మణ యతీంద్రులవారిని ఆధ్యాత్మిక జ్ఞానసమాజమువారు శ్రీ వెంకటేశ్వర కృష్ణాశ్రమమునకు ఆహ్వానించాము హనుమాన్ చాలీసా 108 మంది 108 పర్యాయములు పారాయణం చేయవలయుననే కార్యక్రమము మీద పిల్చారు.

ఈ కార్యక్రమము కోసూరు గ్రామములో శ్రీ వేణుగోపాలరాజు లోగడ జరిపించారు. ఆసమయములో అచ్చటకు పువ్వమ్మ, గంగమ్మగారలు హాజరై ఆపారాయణమును జూచిమన ఆశ్రమములోగూడా జరిపించాలని మొదలుపెట్టారు. ఆసమయంలో వేణుగోపాలరాజుగారి సహాయముతో మా సమాజమునకు శ్రీయతీంద్రులవారు వచ్చారు, అప్పుడు వేణుగోపాలరాజుగారే చాలామంది భక్తులను ఘంటశాల ఆశ్రమమునకు రప్పించి ఆకార్యక్రమము జరిపించారు.

లక్ష్మణయతీంద్రులవారి చెల్లెలు అలివేలు మంగతాయారుగారు. ఒకరోజున యతీంద్రులవారు నృత్యముజేసారు. ఆసమయంలో ఘంటశాలలో భిక్షఅడుగవలయునని సంకల్పించారు.

యతీంద్రులవారు. వారితో కొంతమంది భక్తులు భజనలు చేస్తూతిరుగవలసియున్నది. మేము కార్య భారం వలనతిరుగలేక పోయినా మంత్రిపాలెం భజనసమాజంవారున్నా మాలక్ష్మిగారి పెద్దపాప ఉమామహేశ్వరి ఆకార్యక్రమము నిర్వర్తించారు. వారికి మా కృతజ్ఞతలు. దెందులూరులో గూడ ఒకసమాజమున్నది. వారు వారిగ్రామములో నున్నరామాలయంలో భగవద్గీత పారాయణ, భజనలు పూజలుచేస్తూవుంటారు. వీరుకూడ మాలక్ష్మిగారి చిన్నపాపద్వారా తెలిసికొని గౌరవముగా యుంటారు. కొవ్వలిలో రామదాసుగారున్నా వారికుమారైగారిఅధ్వర్యములో భక్తసమాజమున్నది. రామదాసుగారు కాలముచేసారు. వారికుమార్తెనడుపుతూయున్నది. ఆమె చాలా ప్రేమగాయుంటారు

రావివారిపాలెంలో మనభక్తసమాజమున్నది. దానికి సీతామహాలక్ష్మమ్మ కాపూరి చిట్టెమ్మ గారలు దానిని నడుపుతారు. వారుకూడా మళయాళస్వాములవారి శిష్యులే. ఆచిట్టెమ్మ భర్త కాపూరి లక్ష్మీనారాయణగారిని మేము సనాతనసభలు జరిపే సందర్భంలో స్వాములవారిని తీసికొనివచ్చుటకు పంపించాము. ఆయన మామాటను మన్నించి వ్యాసాశ్రమము వెళ్ళి తీసికొని వచ్చారు. ఆదంపతులు భక్తితత్వము తో ఉంటారు కనకరామబ్రహ్మంగారు ఏలూరు భూమి తనఖా బ్యాంకి మేనేజరుగారు వారిది వట్లూరు. ఆదంపతులు కవి వెంకటసుబ్బయ్య గారి కవిసమ్మేళనమునకు ఘంటశాల వచ్చి స్నేహముతో యుంటున్నారు.

రాజుగారిదిపెదపులివేరు. ఆయన చాలాభక్తిగలవారు. ఉపన్యాసకులు. మంచిహృదయముగలవారు సనాతనసభలకు హాజరైనారు. ఆదంపతులుగూడ కవివెంకటసుబ్బయ్యగారిని చూచుటకు వచ్చినపుడు మమ్ములనుగూడచూచి కుశల ప్రశ్నలుఅడిగి తెలిసికుంటూ ఉంటారు కాళోజీనారాయణరావుగారు కవివెంకటసుబ్బయ్యగారింటికి వచ్చినపుడు నన్నుకూడా పలుకరించుతూ యుంటారు ఆయనకు ఒకసారి మహిళామండలి తరపున కవిసన్మానముచేసాము.

ఊటుకూరిలక్ష్మీకాంతమ్మగారు బాపట్ల నివాసులు. వారు కవిత్వము చెప్పుతారు నేను ఉభయభారతి వ్రాసినపుడు ఆమె ప్రస్తావన వ్రాసారు.

లక్ష్మీరఘురామ్ గారు మహిళాసభలు జరిపినపుడు ప్రారంభకురాలుగా వచ్చారు. అప్పటినుండి స్నేహంగా వుంటారు. ఉభయభారతికి తొలిపలుకులు వ్రాసారు. ఆమెకు నాకృతజ్ఞాభివందనములు. భారతాంబగారిది స్తానువారిపాలెం. ఆమె, చాలా ప్రేమగా వుంటారు. కాపూరు సావిత్రమ్మగారిది నాగాయిలంక. ఆమె ఎచట సత్కార్యములు చేసిననూ ఆమె భర్త హాజరై చూచి సంతోషించుతారు. ఆమె ఘంటశాల ఆధ్యాత్మికజ్ఞాన సమాజంనకు హాజరై చూచి ఆనందించుతూ యుంటారు.

ప్రబోధానందస్వాములవారిది ముండూరులో ఆశ్రమం వున్నదట. ఆయనకు రెండు కన్నులూ లేవు. వేదాంతం, ఉపనిషత్తులుకూడా బాగుగా చెపుతారు. ఆయన అపుడపుడు కమిలీ బాబా సభలలో కనబడుతూ వుండేవారు. ఆయన ఒకనాడు శిష్యుని తీసికొని ఘంటశాలవచ్చి మీరు ఏదయినా కార్యక్రమం పెట్టుకున్నా సరే లేక ఊరికే భగవద్గీత ఉపనిషత్తులు చెప్పమని ననూ చెపుతానని చెప్పారు. ఆడబోయే తీర్థం ఎదురయినట్లు భగవంతుడు తీసికొనివచ్చాడని సంతోషించి గీతాయజ్ఞం పదునెనిమిదిరోజులు ఆశ్రమంలో పెట్టాము. చాల బాగుగ ఉపన్యసించారు. ఆయనకు నమస్కారములు. జయమ్మ భాగవతార్ చాలా రసవంతంగాచెపుతారు హరికథలు. ఆమె ఉచితంగా ఆశ్రమ ప్రవేశమహోత్సవమునను హరికథ చెప్పారు సరస్వతీభాగవ

తార్ గారు మేము గీతాజయంతి సభలు జరిపినపుడు వచ్చి హరికథ చెప్పేవారు. ఆమెను గ్రామస్తులుకూడ అభిమానించి కథలు రామాయణం చెప్పించి వేయిరూపాయిలు యిచ్చిసత్కరించారు.

ఘంటశాలపాలెం మా నాన్నగారు శ్రీసద్గురు మళయాళస్వాములవారు వచ్చినపుడు స్నేహితులు ఆశ్రమం నెలకొల్పడానికి ప్రయత్నించగా కొంతభూమి దానం జేసారు. దానిలో భక్తులు విరాళాలు వసూలుచేసి ఆశ్రమం నిర్మించారు. చింతల మహాలక్ష్మమ్మ మా (చిన్న అమ్మమ్మగారు) ఒకకుంటభూమి. జాస్తి వెంకటరత్నంగారు ఒకకుంటభూమి, వేమూరి వెంకట్రామయ్య, లక్ష్మీదేవమ్మ (వీరు దంపతులు) వారికి పిల్లలులేరు. వారుడభ్భయిసెంట్లు, వేమూరి శ్రీరామమ్మ (మాచిన్నతాత సుబ్బయ్యగారి భార్య) ఒకకుంటభూమి ధర్మం చేశారు. ఇప్పుడు స్వరూపానందస్వామి వుంటారు. వేమూరి ధనలక్ష్మి, మన్నె చిట్టెమ్మ. బోయపాటి ప్రసాద్ అయినవ్రూరి సీతారావమ్మ, వారితల్లి రత్తమ్మగారి ప్రోత్సాహంతో ఆ ఆశ్రమానికి అండదండలుగా వుంటారు. కృష్ణమ్మగారు కూడా అండగా వుంటుంది. ఈ ఆశ్రమం పెద్దాశ్రమంనకు గూడ క్రొత్తపల్లి మునసబుగారి భార్య బసవపూర్ణమ్మ అండదండలు ఉంటాయనుటలో సందియంలేదు.

ఘంటశాల ఆధ్యాత్మిక జ్ఞానసమాజంలో భజనమండలి ఏర్పాటై భజనలు నేర్చుకున్నారు. గొర్రెపాటి భారతలక్ష్మి రాణీప్రమీల, పుష్పవజ్రలీలావతి, అన్నపూర్ణ, వేమూరి సుగుణ (మా మేనల్లుడి భార్య) వేమూరి నవరత్నం, గొర్రెపాటి రమణమ్మ. వేమూరి సీతమ్మ, గొర్రెపాటి రంగమ్మ, గొర్రెపాటి సుబ్బమ్మ, బొండలపాటి గంగమ్మ, పువ్వమ్మ, కాట్రగడ్డ ధనలక్ష్మి, గొర్రెపాటి రాజేశ్వరి, వేమూరి ప్రఫుల్ల, గొర్రెపాటి ప్రసన్నమ్మ, బుల్లిమ్మ, సరస్వతమ్మ, నేను ఇంకా కొందరు భజనలు చేయుటకు వీలయినవుడల్లా హాజరయి భజనలు చేస్తాం. గొర్రెపాటి విశాలక్ష్మి ప్రతికార్యక్రమమునకు హాజరయి సంతసించుతారు. భజన ఒక కళ గదా.

పూర్వం వేమూరి ప్రఫుల్ల, కాట్రగడ్డ ధనలక్ష్మి, దోనేపూడి కోటేశ్వరమ్మ భగవద్గీత బుర్రకథ చెప్పేవారు ఇచ్చటనే దొండపాడు చిట్టెమ్మబృందం నేర్చుకున్నది. అయిననూ రెండుగా చీలుటచే ఘంటశాల బుర్రకథ చెప్పుటలేదు నామసప్తాహం ఏడురోజులు పెట్టించాం. పొరుగు గ్రామస్తులుకూడ వచ్చి నామంచేసి సహాయమిచ్చారు. దిగ్విజయంగా జరిగినది. ఈవిధంగా స్నేహితులు, బంధువులు సజ్జనులందరును నాకు అండదండలుగా వుండగా నేనింతవరకు ప్రపంచములో నొక వ్యక్తిగా నాచేతనయునంతవరకు భగవంతుని కరుణయనే నావలో ఈ ప్రపంచసాగరములో ఈదుతూ సేవాధర్మంతో కాలం గడుపుతూ షష్టిపూర్తి చేసుకొనుచున్నాను.

కాని నశించే ఈశరీరానికీ గదా షష్టిపూర్తి అయినది శాశ్వతంగా ఉండే ఆత్మకు ఏమి వయసున్నది? అది జన్మించేది గాదు. నశించేది కాదు. ఆదిమధ్యాంతరములు లేనిది. ప్రపంచములోగల బంధువులుగాని స్నేహితులుగాని నేను పుట్టకముందు ఈ ప్రపంచమనే తెరమీద వాలినపుడు లేరు. అనంతాత్మలో కలిసినపుడు లేరు. ఈమధ్య ప్రపంచములో తిరుగుచున్నపుడు ఉన్నారు ఈతత్వమునకు అర్థమైతే అంతాసున్నా. ప్రపంచమంతా ఉన్నదనుకుంటే వున్నది. లేదనుకుంటేలేదు ఉన్నదనుకొంటున్నాం. అందుకే ఈరచన వ్రాయవలసి వచ్చినది. ఇప్పుడు నన్ను సన్మానించిన వారలకు నాకృతజ్ఞతాభినందలలు.

లోకాస్సమస్తా సుఖినోభవంతు ఓమ్ తత్ సత్